
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం 22 సెప్టెంబరు 2025

రామభక్తులకు తీపి కబురు!

- మల్కనగిరి- పాండురంగాపురం రూటు మారింది
- రాజుపేట, సారపాకల్లో రైల్వేస్టేషన్ల ఏర్పాటు
- ఒడిశాలో చురుగ్గా భూసేకరణ పనులు

6





ఒక్కేసి పువ్వేసి..

- వాడవాడలా వెల్లివిరిసిన బతుకమ్మ వైభవం
- ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన సంబురాలు

ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): "రామ రామ ఉయ్యాల.. రామనే శ్రీరామ ఉయ్యాల.. ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయే చందమామ.." అంటూ బతుకమ్మ పాటలతో వాడవాడలా బతుకమ్మ వైభవం వెల్లివిరిసింది. ప్రకృతిలోని తంగేడు, కట్ల, చామంతి, బీర, తామర.. ఇలా తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ సంబరాలు తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. మహిళలు ఇంటివద్ద తీరొక్కపూలతో అందమైన బతుకమ్మలను పేర్చి.. అందులో పసుపుతో గౌరీ దేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక ఆరాధనలు చేసి తల్లీ చల్లంగా చూడాలని ప్రణమిల్లారు. సాయంత్రం బతుకమ్మలను తమ తమ వీధుల్లోని కూడళ్ల వద్ద ఉంచి బతుకమ్మ ఆటపాటలతో హోరెత్తించారు. సబ్బండ వర్ణాలంతా ఒకచోట చేరి తమ బతుకు చిత్రాన్ని ఒక్కొక్క పూలతో వర్ణిస్తూ పాడిన బతుకమ్మ పాటలు ఊరు వాడలా మార్మోగాయి. ఆడపడుచులంతా సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ సామూహికంగా తిరుగుతూ బతుకమ్మ పాటలకు లయబద్ధంగా చప్పట్లు కొడుతూ ఆడి పాడి పూల పండుగకు వన్నె తెచ్చారు. అనంతరం తమ సమీప ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



ఖమ్మం బుర్హాన్‌పురంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఇదేంటి 'రామ'!?

- ఆరేళ్లు గడిచినా.. 'సీతారామ' రైతులకు అందని పరిహారం
- రైతుల భూముల్లో కాలువలు, వంతెనల నిర్మాణాలు
- రికార్డుల నుంచి తొలగింపు
- రైతు బంధు, బ్యాంకు రుణాలూ లేవు
- ప్రభుత్వ భూములకు చెల్లింపులు.. పట్టా భూములకు మొండి చెయ్యి
- లబోదిబో మంటున్న రైతులు



సీతారామ ప్రాజెక్టు కాలువపై నిర్మించిన కల్వర్టులు

అశ్వారావుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడైనా.. ఏ ప్రాజెక్టు నిర్మించినా.. రహదారి వేసినా.. అందులో భూములు కోల్పోయిన రైతుల భూములకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుంది. ముఖ్యంగా పట్టా భూములకు తప్పనిసరిగా చెల్లించాల్సిందే.. కానీ సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ప్రభుత్వ భూములు, అటవీ భూములు ఆక్రమణలలో ఉన్న రైతులకు హడావుడిగా సర్వేలు చేసి భూ పరిహారం చెల్లించేశారు. కానీ ఏళ్ల తరబడి సాగు చేసుకుంటూ పట్టాలు కలిగిన రైతుల భూములకు మాత్రం ఆరేళ్లు గడిచినా.. ఇప్పటికీ ప్రభుత్వం భూ పరిహారాన్ని చెల్లించలేదు. కాలువలు, నిర్మాణాలకు గుర్తించిన భూములను ఆరేళ్ల క్రితమే అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిర్మాణాలు చేపట్టారు. కానీ పరిహారం చెల్లించడంలో మాత్రం ముందుకు రావడం లేదు. భూములు కోల్పోయిన రైతులు కాళ్లకు చెప్పులు అరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కానీ ఇప్పటికీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి.. అక్కడే అన్న చందంగా మారింది.

రూ.17.50కోట్ల భూముల పరిహారం బకాయి

సీతారామ ప్రాజెక్టు ప్యాకేజీ 12 పరిధిలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో ఆరేళ్ల క్రితం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్మాణం కోసం భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. అవార్డు ఎంక్వైయిరీ నిర్వహించి పరిహారం మంజూరు చేశారు. సంబంధిత రైతుల వద్ద నుంచి పాస్ బుక్‌లు, ఇతర ఆధారాలన్నింటినీ స్వాధీనం చేసుకొని రెవెన్యూ రికార్డుల నుంచి వారి పేర్లను పూర్తిగా తొలగించేశారు. కొద్దిరోజుల్లోనే పరిహారం చెల్లిస్తామంటూ రైతులకు పరిహారం మంజూరు పత్రాలను అందజేసి గుర్తించిన ప్రదేశాల్లో కాలువలు, వంతెనల నిర్మాణాలను చేపట్టారు. ఇదంతా 2019లో జరిగింది. కానీ ఇప్పుడు 2025 సంవత్సరం కూడా వచ్చేసింది. ఇప్పటికీ ఆరేళ్లయినా.. రైతు పొలం పోయింది కానీ పరిహారం మాత్రం రాకపోవడంతో.. బాధితులు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా ఎవరు కూడా రైతుల గోడును పట్టించుకునే వారే కరువయ్యారు. అశ్వారావుపేట మండలం అనుపాక రెవిన్యూ పరిధిలోని వినాయకపురం గ్రామంలోనే 9మంది రైతులకు చెందిన 36.9 ఎకరాల భూమి ప్రాజెక్టు కాలువలో కోల్పోయింది.

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన జగ్గారం రైతులు

తమ గ్రామానికి చెందిన 180 ఎకరాల భూమిని సీతారామ ప్రాజెక్టులో కోల్పోయామని, అయినా ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదంటూ దమ్మపేట మండలం జగ్గారానికి చెందిన రైతులు ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు హైకోర్టులోనూ పిల్ దాఖలు చేశారు. వీరి ఫిర్యాదుతో రైతులకు తక్షణమే పరిహారం అందజేయాలంటూ హైకోర్టు.. జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయిప్పటికీ వీరికి ఇప్పటివరకు మోక్షం లభించలేదు.

రికార్డుల్లో తొలగించారు..

వినాయకపురం గ్రామానికి చెందిన రైతులు లకావత్ దివ్య స.నెం.229/6/1లో 0.3 కుంటలు, గుగులోతు దుర్గమ్మ స.నె.229/2/1లో 4.36 ఎకరాలు, నారం చుక్కమ్మ స.నెం.229/11/1లో 5 ఎకరాలు, భూక్యా నగీన స.నెం.229లో 6.06 ఎకరాలు, భేతి పొట్టిమ్మ 4.32ఎకరాలు, కొర్రి వెంకట లక్ష్మి, లకావత్ పద్మ, లకావత్ సోమమ్మ, సరియం ముత్యాలరావు, బానోతు ప్రమీల తదితరులు 36.19 కుంటల భూమిని కోల్పోయారు. మీకు పరిహారం మంజూరు అయ్యిందంటూ రెవిన్యూ రికార్డుల నుంచి ఆనాడే అధికారులు తొలగించారు. భూమిని స్వాధీనం చేసుకొని నిర్మాణాలు కూడా చేపట్టారు. ఆనాటి నుంచి ఈ రైతులు ఆ భూముల్లో ఆదాయాన్ని కోల్పోయారు. రైతు బంధు కూడా నిలిచి పోయింది. పహానీలు రాకపోవడంతో ఈ భూములపై బ్యాంకుల్లో ఉన్న అప్పులను చెల్లించాల్సి వచ్చింది. పరిహారం వస్తుంది కదా.. అనే ఉద్దేశ్యంతో చాలా మంది రైతులు అప్పులు చేసి బ్యాంకు రుణాలను చెల్లించారు. ఆరు సంవత్సరాలు గడిచినా.. పరిహారం సొమ్ములు చెల్లించకపోవడంతో అప్పులు చేసిన రైతులు ప్రస్తుతం వడ్డీల భారంతో సతమతమవుతున్నారు. దీంతో భూమి పోయింది, పరిహారం చెల్లించలేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వందల సార్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినా.. ఫలితం లేకుండా పోతుందని రైతులు లబోదిబో మంటున్నారు. ప్రభుత్వ భూములకు పరిహారం చెల్లించిన (మిగతా 6వ పేజీలో)

లక్ష్మీపురంలో మంత్రి తుమ్మల

పామాయిల్‌లో అంతర పంటల సాగు పరిశీలన



ఏపీలోని లక్ష్మీపురం గ్రామంలో పామాయిల్ సాగులో అంతర పంటలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన అనుచరులతో కలిసి ఆదివారం పామాయిల్ తోటలో అంతర పంటలుగా సాగు చేసిన వక్క, కోకో పంటలను పరిశీలించారు. గన్నమనేని రాంబాబు అనే రైతు ఎనిమిదేళ్లుగా పామాయిల్ తోటలో అంతర పంటలుగా కోకో, వక్క పంటలను సాగు చేశారు. దీంతో రైతు రాంబాబుతో పామాయిల్ సాగు, అంతర పంటల విధానంపై తుమ్మల చర్చించి సలహాలు, పలు సూచనలు చేశారు. పామాయిల్ మొక్కలు ఏపుగా, ఆరోగ్యంగా ఉండడంతో సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా సేంద్రియ ఎరువులనే వాడుతున్నట్లు రైతు రాంబాబు వివరించారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల పామాయిల్ దిగుబడులు పెరగడంతోపాటు ఎరువుల ఖర్చులు తక్కువ అని తెలిపారు. పామాయిల్ కోకో సాగు చేయడంతో ఆకు ఎక్కువగా ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. కాగా.. మంత్రి తుమ్మల పామాయిల్ సాగులో దీర్ఘకాలంగా ఏ ఏ అంతర పంటలు సాగు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందన్న విషయమై.. ఉద్యాన శాస్త్రవేత్తలతో పలు దఫాలుగా చర్చలు జరిపారు. అలాగే ఏపీలోని పలు జిల్లాల్లో పామాయిల్ సాగులో అంతర పంటలను పరిశీలించి వివరాలను సేకరిస్తున్నారు. వ్యవసాయశాఖ మంత్రిగా ఉద్యాన పంటల సాగులో రైతులకు లాభాదాయకమైన పంటలు సాగు చేసేందుకు కృషి చేస్తున్నారు. అంతకు ముందు తుమ్మల.. గండుగులపల్లి గ్రామానికి చెందిన తన బంధువు ఎర్రా వసంతరావు అత్తయ్య ఇటీవల మృతి చెందడంతో పశ్చిమగోదావరి జిల్లాలోని చాగల్లులో జరిగిన దశదిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యావతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

పెట్రోల్‌బంక్‌ల ఏర్పాటు వైపు..

సింగరేణి అడుగులు

- కీలక విభాగాల్లో వ్యాపారాలపై దృష్టి సారిస్తున్న సింగరేణి
- 7 పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు అనుమతులు
- మరిన్ని ప్రాంతాలకు విస్తరించేలా ప్రతిపాదనలు

6

ఆంక్షలు సడలించిన ట్రంప్

ఉమ్మడి జిల్లా ఎన్ఆర్ఐ కుటుంబాల్లో వీడిన టెన్షన్

ఖమ్మం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : హెచ్1బీ వీసాల మంజూరు, రెన్యువల్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన కొత్త నిబంధనల్లో పలు మార్పులు చేయడంతో ఎన్ఆర్ఐ కుటుంబాల్లో టెన్షన్ వీడింది. శనివారం ట్రంప్ విధించిన ఆంక్షల్లో హెచ్1బీ వీసాదారుడికి సంబంధిత ఐటీ కంపెనీలు ప్రతి ఏటా లక్ష డాలర్లు చెల్లించాలని, హెచ్1బీ వీసాను ప్రతీ ఏడాది రెన్యువల్ చేయాలని పలు కఠిన నిబంధనలు విధించిన విషయం తెలిసిందే. దీంతో అమెరికాలో ఇప్పటికే స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్న జిల్లాకు చెందిన హెచ్1బీ వీసాదారులు, ఉన్నత చదువుల కోసం వెళ్లిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన నిరసనలు దృష్టిలో పెట్టుకుని అమెరికాలోని ఐటీ కంపెనీల వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని వైట్‌హౌస్ నుంచి కొంత నిబంధనలు మార్పు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. తాజా నిబంధనల్లో కేవలం విదేశాల నుంచి అమెరికాలో ఉద్యోగం చేసేందుకు వెళ్లేందుకు ఆయా ఐటీ కంపెనీలు హెచ్1బీ వీసాదారులకు లక్ష డాలర్లు చెల్లించాలని నిబంధనలు విధించారు. ఇది ఏడాది పాటు అమల్లో ఉంటుంది. అయితే ఇప్పటికే ఎఫ్1 వీసా కింద అమెరికా చదువులకు వెళ్లిన విద్యార్థులకు, ఓపీటీ మీద ఉన్న విద్యార్థులకు హెచ్1బీ నిబంధనల్లో సడలింపు ఇచ్చారు. చదువు అనంతరం ఉద్యోగం చేసుకునేందుకు

(మిగతా 6వ పేజీలో)





అమ్మవారి ఆలయం

భద్రాద్రిలో రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

అక్టోబరు 2 వరకు నిర్వహణ

భద్రాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచల సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. అమ్మవారి ఆలయానికి కొత్తగా రంగులు వేయడంతో పాటు శ్రీసీతారామచంద్రస్వామివారి దర్బారు సేవను ఈ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి ఆలయానికి ఎదురుగా ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు. ఇందుకోసం వేదికకు రంగులు వేశారు. అక్టోబరు 2 వరకు వివిధ అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. విజయదశమి నాడు శ్రీరామ మహాపట్టాభిషేకం, విజయోత్సవం, శమీ పూజ, ఆయుధపూజ, శ్రీరామలీలా మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

నేటి అర్ధరాత్రి నుంచి..

మిషన్ భగీరథ కార్మికుల సమ్మె

- జిల్లా వ్యాప్తంగా 21 మండలాల్లో మంచినీటి సరఫరా బంద్
- జేసీతో విఫలమైన చర్చలు
- సమ్మెకు పిలుపునిచ్చిన జేఏసీ నాయకులు

6




కల్లూరు సబ్ డివిజన్లో సమ్మెకు సిద్ధమంటున్న కార్మికులు

'గిరి' బిడ్డలకు

ఉద్దీపకంలా..

- సత్ఫలితాన్నిస్తున్న 'ఉద్దీపకం'
- మెరుగైన గిరిజన బిడ్డల ప్రాథమిక విద్య
- సాకారమవుతున్న ఐటీడీఏ పీవో రాహుల్ ప్రయత్నం
- విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు త్వరలో పరీక్ష

గిరిజన విద్యా సంస్థల్లో విద్యనభ్యసించే గిరిజన బిడ్డల ప్రాథమిక విద్యను పటిష్ఠం చేసేందుకు చేపట్టిన కసరత్తు సత్ఫలితాల దిశగా సాగుతోంది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల్లో చాలా మంది గతంలో పదాలను గుర్తించడం, ఉచ్చరించడంతో పాటు లెక్కల్లో ప్రాథమిక పరిజ్ఞానం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ విషయాన్ని ఐటీడీఏ పీవో బి.రాహుల్ గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్లో 'ఉద్దీపకం' అనే పుస్తకాన్ని ఐటీడీఏ పరిధిలోని విద్యాశాఖలో ఉన్న ప్రాజెక్టు మానిటరింగ్ అండ్ రిసోర్సు సెల్ (పీఎంఆర్‌సీ) బృందం ద్వారా ఆంగ్లం, గణితంలో విద్యార్థులకు రూపొందించి అందించారు. అయితే ఈ ప్రయత్నం గిరిజన పిల్లల బతుకుల్లో దీపంలా మారి.. వెలుగులు నింపుతోంది. అనేక సత్ఫలితాలను ఇవ్వడంతో.. అధికారులు మరిన్ని మెరుగులు దిద్ది ఉద్దీపకం-2 ప్రవేశపెట్టి.. దాని ద్వారా ప్రాథమిక విద్యను మరింత పటిష్ఠం చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో పీఎంఆర్‌సీ బృందం ఇందుకు సంబంధించిన కసరత్తు చేపట్టి ఉద్దీపకం-2ను రూపొందించారు.



భద్రాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులక ఉద్దీపకం-2 పుస్తకం అందజేయగా.. ఇప్పటికీ 30 రోజులు పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా 25,446 పుస్తకాలను అధికారులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉద్దీపకంను తొలిసారిగా గత ఏడాది డిసెంబర్‌లో మూడు, నాలుగు, ఐదు తరగతుల్లోని ఏడు వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరేలా అందజేశారు. మలి విడతలో ఉద్దీపకం-2ను ఒకటి, రెండు తరగతులకు తెలుగు, మూడు, నాలుగు, ఐదు, ఆరు ఏడు తరగతులకు లెక్కలు, ఆంగ్లాన్ని రూపొందించారు. ఈ ఉద్దీపకం పుస్తకాలను భద్రాచలం ఐటీడీఏ ఓ వర్క్‌బుక్‌లా రూపొందించి.. ఇప్పటికే భద్రాద్రి జిల్లాలో 219 జీపీఎస్‌లలోని ఐదువేల మందికి, అలాగే 30 పాఠశాలల్లో రెండువేల మందికి అందజేశారు. అదేవిధంగా ఖమ్మం జిల్లాలో 14 జీపీఎస్‌లు, 10 ఆశ్రమ పాఠశాలల్లో సైతం 2,666మంది విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే మొత్తం 60 రోజుల వ్యవధిలో లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉండగా.. ఇప్పటికీ 30 రోజులు పూర్తయ్యాయి. ఈ సమయంలో విద్యార్థుల నుంచి సత్ఫలితాలు వస్తున్నాయి. మరో 30 రోజుల అనంతరం ఈ వర్క్ బుక్ ప్రక్రియ పూర్తి కానుంది.

రెండు నెలల అనంతరం నేర్చుకున్న విద్యార్థులకు పరీక్షలు

ఉద్దీపకం, ఉద్దీపకం-2లో నేర్చుకున్న అంశాలను అంచనా వేసేందుకు విద్యార్థులకు రెండు నెలల అనంతరం జంబ్లింగ్ విధానంలో పరీక్ష నిర్వహించి.. (మిగతా 6వ పేజీలో)

చిట్టడివిని తలపిస్తున్న
మిథిలా స్టేడియం ప్రాంగణం




పిచ్చి మొక్కలతో చిట్టడివిని తలపిస్తున్న స్టేడియం ఆవరణ

భద్రాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిధిలోని మిథిలా స్టేడియం ప్రాంగణం చిట్టడివిని తలపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలతో స్టేడియంలోని పలు సెక్టార్లలో పిచ్చి మొక్కలు గుబురుగా పెరగడంతో చిట్టడివిన తలపిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఇటీవల కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకంలో భాగంగా రూ.1.60 కోట్లతో గాల్వాలియం షెడ్ నిర్మాణం చేపట్టారు. సామాన్య భక్తులు అక్కడ సేద తీరాలన్నా చుట్టూర గుబురుగా పిచ్చి మొక్కలు భారీ ఎత్తున ఉండటంతో పాములు లేదా ఇతర్రా విష జంతువులు వచ్చే అవకాశం లేకపోలేదు. బయట నుంచి వచ్చే భక్తులకు అది మిథిలా స్టేడియం అని చెబితే కాని తెలిసే పరిస్థితి అక్కడ తెలిసే పరిస్థితి లేదంటే అతిశయోక్తి కాదు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు రామాలయ దర్శనం అనంతరం మిథిలా స్టేడియంను సందర్శించి శిల్పకళాశోభితమైన కల్యాణ మండపాన్ని తిలకిస్తూ ఉంటారు. కాని ఇక్కడ పరిస్థితి విభిన్నంగా ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది.

శిల్పకళా శోభితమైన కల్యాణ మండపం పరిసరాల్లో ఈ విధంగా పిచ్చి మొక్కలు ఉన్నా దేవస్థానం అధికారులు, సిబ్బంది ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం పట్ల భక్తుల నుంచి ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా ఈ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేయాలని భక్తులు కోరుతున్నారు.

పెట్రోల్‌బంక్‌ల ఏర్పాటు వైపు..
సింగరేణి అడుగులు

- కీలక విభాగాల్లో వ్యాపారాలపై దృష్టి సారిస్తున్న సింగరేణి
- 7 పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు అనుమతులు
- భవిష్యత్‌లో మరిన్ని ప్రాంతాలకు విస్తరించేలా ప్రతిపాదనలు



కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తిలో అగ్రభాగాన నిలిచిన సింగరేణి యాజమాన్యం మరిన్ని వ్యాపార కార్యకలాపాల వైపు అడుగులు వేస్తుంది. ఇప్పటికే బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్ ఉత్పత్తి, సోలార్ ఉత్పత్తి ప్రారంభించిన సింగరేణి, బంగారు గనుల ఏర్పాటు వైపు పయనం ప్రారంభించింది. బంగారు గనుల ఏర్పాటుకు అనుమతులను సాధించి ఇతర సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని ముందుకు సాగుతున్న సింగరేణి పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుపై సైతం దృష్టిసారించింది. సింగరేణి వ్యాప్తంగా పలు ఏరియాలలో 7 పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను సాధించింది. మరిన్ని పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటుంది. భవిష్యత్తు అవసరాలు, సింగరేణి సంస్థ అభివృద్ధి కార్మికుల సంక్షేమం పై దృష్టి సారిస్తూనే మరిన్ని నూతన ప్రాజెక్టుల ఏర్పాటుకు సింగరేణి యాజమాన్యం పరుగులు పెడుతుంది. ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్, భారత్ పెట్రోలియం కార్పోరేషన్‌లకు సంబంధించిన 7 పెట్రోల్ బంక్‌లను సింగరేణిలో ఏర్పాటు చేస్తుంది. రామగుండం ఏరియా-2, మణుగూరు ఏరియా, మందమర్రి, రామగుండం-1, కొత్తగూడెం కార్పోరేట్, భూపాలపల్లిలలో పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తుంది. సింగరేణి ఎస్టేట్ అధికారులు పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు అవసరమైన భూమిని సైతం కేటాయించారు. నిర్మాణపు పనులను మరో పది రోజుల్లో ప్రారంభించే విధంగా అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

మొదటి దశలో ఏడు పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేస్తున్న సింగరేణి 11 ఏరియాలలో ఉన్న సింగరేణి మరో నాలుగు ఏరియాలలో సైతం పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతుల కోసం ప్రయత్నాలు చేస్తుంది. సింగరేణి సంస్థ అవసరాలు, ఉద్యోగులు, కార్మికులతో పాటు సమీప ప్రాంత ప్రజలకు పెట్రోల్ డీజిల్ సేవలను అందుబాటులోకి తెస్తుంది. ప్రధాన కూడలిలో పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యతతో కూడిన పెట్రోల్ డీజిల్‌ను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సింగరేణి భావిస్తున్నట్లు ప్రచారం సాగుతుంది.

తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కానుంది. ఇప్పటికే సింగరేణి సూపర్ బజార్‌ల ద్వారా అనేక సూపర్‌మార్కెట్‌లను ఏర్పాటు చేసి, నిత్యావసర వస్తువులను సింగరేణి, కార్మికులు, ఉద్యోగులు సమీప ప్రాంత ప్రజానికానికి అందుబాటులో ఉంచుతున్న యాజమాన్యం మరిన్ని సేవలను కొనసాగించాలని భావిస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. ప్రధానంగా సింగరేణి ప్రధాన కార్యాలయం ఉన్న కొత్తగూడెం కార్మికులు అధికంగా ఉన్న గోదావరిఖని ఏరియాలలో మల్టీపుల్ కాంప్లెక్స్‌లను సైతం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బలరామ్, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. దీంతో సింగరేణి యాజమాన్యం వ్యాపార కార్యకలాపాలను ఉధృతం చేస్తున్నట్లు ప్రచారం సాగుతుంది.

మరిన్ని పెట్రోల్‌బంక్‌లు ఏర్పాటు చేస్తాం

● సీఎండీ బలరాం



సింగరేణి ఏరియాల్లో మరిన్ని పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. కార్మికుల అవసరాలతోపాటు సమీప ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం. సూపర్‌బజార్‌లను మరింత ఆధునీకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము. పెట్రోల్‌బంక్‌ల నిర్మాణ పనులను విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాను.

ఒకే ఈతలో ఐదు మేక పిల్లలు



కూసుమంచి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఒకే ఈతలో ఐదు మేకపిల్లలు జన్మించిన ఘటన కూసుమంచిలో ఆదివారం చోటుచేసుకుంది. సాధారణంగా మేక ఒకటి లేదా రెండు పిల్లలకు జన్మనిస్తుంది. కూసుమంచికి చెందిన ఎర్రబోయిన నాగేశ్వరరావు అనే రైతుకు చెందిన మేకకు ఒకే ఈతో ఐదుపిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో నాలుగు ఆరోగ్యంగా ఉండగా, మరోకటి పిండం పూర్తిగా అభివృద్ధి చెందకపోవడంతో చనిపోయింది. మిగిలిన పిల్లలన్నీ చెంగుచెంగునా దుంకుతుండటంతో స్థానికులు చూసేందుకు ఆసక్తి కనబరిచారు.

ప్రోటోకాల్ విభాగంలో దిద్దుబాటు చర్యలు



ప్రోటోకాల్ స్లిప్‌లను జారీ చేస్తున్న దృశ్యం

భద్రాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఉన్న ప్రోటోకాల్ విభాగంలో ఎదురవుతున్న సమస్యలకు దిద్దుబాటు చర్యలను అధికారులు చేపట్టారు. 'అంతా గోప్యంగా! భద్రాద్రి దేవస్థానంలో ఏం జరుగుతోంది?' కీలక విభాగాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం అనే శీర్షికన ఆదివారం వెలువడిన కథనానికి దేవస్థానం అధికారులు స్పందించారు. ఈ క్రమంలో ప్రోటోకాల్ విభాగానికి సంబంధించిన సాంకేతిక అంశాలను సమకూర్చి అమలు చేస్తున్న ఆత్రేయ ఇన్ఫోటెక్ సంస్థ వారు ఆదివారం సమస్యలను పరిష్కరించి ప్రోటోకాల్ విభాగం యథావిధిగా పని చేసేలా చేశారు. దీంతో మళ్లీ భక్తులకు ప్రోటోకాల్ విభాగంలో కంప్యూటరైజ్ ప్రోటోకాల్ టికెట్లను జారీ చేస్తున్నారు.

సింగరేణి కార్మికులకు శుభవార్త

- నేడు లాభాల వాటా ప్రకటించనున్న యాజమాన్యం...
- సీఎం, మంత్రుల సమక్షంలో ప్రకటించేందుకు సింగరేణి ఏర్పాట్లు

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు యాజమాన్యం తీపి కబురు ప్రకటించనుంది. సోమవారం హైదరాబాదులోని మహాత్మ, జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో సింగరేణి సంస్థకు వచ్చిన 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ప్ర కటించి, కార్మికుల వాటాను సైతం ప్రకటించే విధంగా సింగరేణి యాజమాన్యం ఏర్పాట్లు చేస్తుంది. లాభాల ప్రకటన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు , పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ్యులతో పాటు, కోల్‌బెల్ట్ ఏరియాలోని శాసనసభ్యులను ఆహ్వానిస్తుంది. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘంతో పాటు ప్రాతినిధ్య కార్మిక సంఘాలను ఆహ్వానించి వారి సమక్షంలోనే లాభాలను ప్రకటించే విధంగా సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు సంబంధించి రాష్ట్ర మంత్రులకు, పార్లమెంట్, రాజ్యసభ, శాసనసభ్యులకు, శాసనమండలి సభ్యులకు ఆహ్వానాలను సింగరేణి యాజమాన్యం పంపింది.

ఆంక్షలు సడలించిన ట్రంప్

(5వ పేజీ తరువాయి)

ఎఫ్1 వీసా నుంచి హెచ్1బీ వీసా మార్పు నిమిత్తం ఆయా సంస్థలు లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. అలాగే ఇప్పటికే అమెరికాలో హెచ్1బీ వీసాతో ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా రెన్యువల్‌కు లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదని సడలింపు ఇచ్చారు. దీంతో ఉమ్మడిజిల్లా నుంచి సుమారు 10వేల నుంచి 15వేల మంది ఎన్ఆర్ఐలు ఉద్యోగం, చదువు నిమిత్తం వెళ్లిన వారి కుటుంబాల్లో ఆందోళన వీడింది. అయితే హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పూణేలో అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ తదితర ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ నేరుగా హెచ్1బీ వీసా పొంది అమెరికా వెళ్లాలనుకుంటున్న వారి కలలు మాత్రం నెరవేరే పరిస్థితి లేదు. ఇలా వెళ్లాలనుకున్న వారికి ఆయా కంపెనీలు తప్పనిసరిగా లక్ష డాలర్లు చెల్లించాలనే నిబంధన విధించింది. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన అనేకమంది ఐటీ ఉద్యోగులు తమ సంస్థల తరుపున నేరుగా అమెరికా వెళ్లే అవకాశం కోల్పోనున్నారు. స్టూడెంట్ వీసా ద్వారా అమెరికా వెళ్లే అవకాశం కలగనుంది. ట్రంప్ విధించిన తాజా నిబంధనలు హెచ్1బీ వీసాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు తప్పుడు ధృవీకరణలతో అమెరికా వెళ్లాలనుకుంటున్న వారికి కూడా ఇబ్బందులు కలగనున్నాయి. ఏది ఏమైనా హెచ్1బీ వీసా విషయంలో ఇచ్చిన సడలింపులు.. అక్కడ చదువుకుంటున్న విద్యార్థులతో పాటు ఇప్పటికే హెచ్1బీతో ఉద్యోగం చేస్తున్న వారికి ఊరట కలిగించాయి.

ఆదివాసీలపై దాడులు ఆపాలి

- మాజీ ఎంపీ, టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబురావు



సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు

భద్రాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలపై అటవీశాఖ అధికారుల దాడులు ఆపాలని, ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని మాజీ ఎంపీ, టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబురావు అన్నారు. భద్రాచలంలో ఆదివారం జరిగిన ఆదివాసీ గిరిజన సంఘం విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు సాగు చేస్తున్న భూముల్లో అటవీ అధికారులు పత్తి మొక్కలు, ఇతర పంటలను ధ్వంసం చేయడం, ఆదివాసీల జోలికొస్తే ఊరుకునేది లేదని, దాడులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అనేక మంది ఆదివాసీ నిరుద్యోగులు చదువులు పూర్తి చేసుకొని ఎటువంటి ఉద్యోగం, ఉపాధి లేకుండా నిరుద్యోగులుగా ఉన్న వారందరికీ ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను అసలైన ఆదివాసీలతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాయం నరసింహారావు, మడివి రమేష్, సోయం జోగారావు, కుంజా శ్రీను, దుబ్బ గోవర్ధన్, సోడెం ప్రసాద్, మడకం సతీష్, కొమరం కాంతారావు, కాకా హనుమంతరావు, కుంజా విజయ, రవ్వ సారిక, పొడియం వెంకటేశ్వర్లు, ప్రవీణ్ మడెం రమేష్, తిరుపతిరావు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు ఇంటర్వ్యూ

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు ఏరియా జీఎం వి .కృష్ణయ్య ఆదేశాల మేరకు కారుణ్య నియామకాలు కోసం మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగి వారసులకు జీఎం కార్యాలయంలో ఆదివారం ముఖాముఖీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్‌వోటూ జీఎం రామస్వామి డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారాం మాట్లాడుతూ ఇల్లెందు ఏరియా వర్క్‌షాపు, సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ నుంచి కారుణ్య నియామకాల కోసం మెడికల్ ఇన్వాలిడేషన్ డెత్ అయిన ఉద్యోగుల వారసులకు వారి కుటుంబసభ్యులకు సాక్షుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అన్ని వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం వర్క్ షాపు నాగరాజు నాయక్, మధుబాబు, అంజిరెడ్డి, వి.అజయ్,అపర్ణ, కే.రత్నకుమార్, ఎల్ మదు తదితరులు పాల్గొన్నారు.

రామభక్తులకు తీపి కబురు!

- మారిన మల్కనగిరి- పాండురంగాపురం రూటు
- రాజుపేట, సారపాకల్లో రైల్వేస్టేషన్ల ఏర్పాటు
- ఒడిశాలో చురుగ్గా భూ సేకరణ పనులు



భద్రాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని దర్శించడానికి తరలివచ్చే రామభక్తుల మనోభీష్టం నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయి. గతంలో ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి నుంచి పాండురంగాపురం వరకు రైల్వే లైను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబందించి సర్వే నిర్వహించి భూ సేకరణ పనులు ఇప్పటికే చేపట్టారు. ఇందులో భాగంగా భూ సేకరణ పనులు ఒడిశా రాష్ట్రంలో చేపట్టగా అవి ఇటీవల కాలంలో వేగం అందుకున్నాయి. ఎకరాకు రూ.10 లక్షల చొప్పున పరిహారంను భూ నిర్వాసితులకు అందిస్తున్నారు. మల్కనగిరి టూ పాండురంగాపురం బ్రాడ్‌గేజి లైను ఇప్పటి వరకు అనుకున్నట్లు కాకుండా రూట్ మారనుంది. ఒడిశా ఏపీ తెలంగాణ రాష్ట్రాలోని పలు గ్రామాల మీదుగా ఈ రైల్వే లైను ఏర్పాటు చేయనున్నారు. ఒడిశాలోని మల్కనగిరి నుంచి తెలంగాణలోని పాండురంగాపురం వరకు 173.61 కి.మీ. నూతన రైల్వే లైను ఏర్పాటుకు రూ.3,592 కోట్ల నిధులు కేటాయించారు. వాస్తవానికి ఈ లైను ఏర్పాటుకు 2023లోనే ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్ఎల్ఎస్) పూర్తయ్యింది. కాగా 2025 డిసెంబరు నాటికి భూ సేకరణ పనులు పూర్తి చేసి 2026 జనవరి నుంచి రైల్వే లైను ఏర్పాటు పనులు చేపట్టాలని లక్ష్యంతో రైల్వేశాఖ కసరత్తు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఈ రైల్వేలైను 2030లోపు పూర్తి చేయాలని కేంద్రం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

గతంలో ఇలా...మారిన రూట్ ఇలా

మల్కనగిరి నుంచి పాండురంగాపురం వరకు రైల్వేలైను ఏర్పాటుకు 2024న ఆగస్టులోనే కేంద్ర క్యాబినేట్ ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి గతిశక్తి మాస్టర్‌ప్లాన్ పథకంలో భాగంగా ఈ నూతన రైల్వేలైను త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు వేగవంతం చేసింది. గతంలో రైల్వేలైన్ మల్కనగిరి, బాదలి, పడిమెట్ల, రాజన్‌గూడ, లచ్చిపేట, కొండపల్లి, మోటు రైల్వే స్టేషన్లు ప్రతిపాదించారు. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో కన్నాపురం(సరివెల), కూనవరం మండలంలోని కూటురుగట్టు, పల్లూరు అక్కడ నుంచి యటపాక మండలంలోని నందిగామ, తెలంగాణలోని భద్రాచలం మీదుగా పాండురంగాపురం రైల్వే స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. అయితే తాజాగా ఏపీలోని చింతూరు మండలం కుయుగూరు, కూనవరం మండలంలోని సీతారామపురం, భీమవరంలలో రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేసే ప్రతిపాదన సరికొత్తగా తెరపైకి వచ్చింది. కాగా తెలంగాణలో భద్రాచలం-చర్ల రోడ్డులో శివారున ఉన్న రాజుపేట (భద్రాచలం రైల్వే స్టేషన్)ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన తెరపైకి రావడం విశేషం. దాదాపుగా ఇక్కడ రైల్వేస్టేషన్ ఏర్పాటు చేస్తారనే ప్రచారం జోరందుకుంది. భద్రాచలం రామాలయంకు కూతవేటు దూరంలోనే రైల్వేస్టేషన్ వస్తుండటంతో భవిష్యత్తులో రైలు మార్గం ద్వారా వేలాది మంది భక్తులు భద్రాద్రి రామయ్య దర్శనంకు తరలివచ్చే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. అలాగే బూర్గంపాడు మండలంలోని సారపాకలో కూడా కొత్తగా రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. చివరకు పాండురంగాపురం రైల్వేస్టేషన్‌కు వద్ద మల్కనగిరి నుంచి వచ్చే రైల్వేలైను ముగియనుంది.

ఇదేంటి 'రామ'!?

(5వ పేజీ తరువాయి)

అధికారులు పట్టా భూములకు పరిహారం ఎందుకు చెల్లించడం లేదో అర్థం కావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

అప్పుచేసి బ్యాంకు అప్పు కట్టాల్సి వస్తుంది..

● కొర్రి వెంకట లక్ష్మి, వినాయకపురం

2019లో సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్మాణం కోసం నాకున్న ఐదెకరాల భూమిని ప్రభుత్వం తీసుకుంది. అప్పుడే రికార్డుల్లో నుంచి నా పేరును తొలగించారు. కానీ ఇప్పటివరకు పరిహారం చెల్లించలేదు. పహనీలు రాకపోవడంతో బ్యాంకులు అప్పులను రెన్యూవల్ చేసేందుకు నిరాకరించాయి. దీంతో అప్పులు చేసి రుణం చెల్లించాల్సి వస్తుంది.

ఆరేళ్లయినా.. పరిహారం చెల్లించలేదు.

● లకావత్ దివ్య, వినాయకపురం

ప్రభుత్వ భూములకు తక్షణమే పరిహారం ఇచ్చారు. పట్టా భూముల రైతులు ఏమి ఖర్మ చేసుకున్నారో అర్థం కావడం లేదు. ఇప్పటికీ ఆరేళ్లయినా.. పరిహారం చెల్లించలేదు. పైగా రికార్డులో తొలగించారు. భూముల్లో నిర్మాణాలు చేపట్టడంతో సాగును కోల్పోయాం. పరిహారం కూడా చెల్లించలేదు. రైతు బంధు, ఇతర లబ్ధిని పోగొట్టుకున్నాం.

రూ.17.50 కోట్ల భూ పరిహారం చెల్లించాలి..

బి. కృష్ణ, ఇరిగేషన్ డీఈఈ

సీతారామ ప్రాజెక్టు ప్యాకేజీ 12 పరిధిలో 219 ఎకరాలకు రూ.17.50 కోట్లు పరిహారం మంజూరైంది. ఈ విషయమై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరిగింది. త్వరలోనే పరిహారం చెల్లిస్తాం.

'గిరి' బిడ్డలకు
ఉద్దీపకంలా..

(5వ పేజీ తరువాయి)

స్టూడెంట్స్ సామర్థ్యాన్ని పరీక్షించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 15 రోజులకు ఒకసారి విద్యార్థులకు వారి స్థాయిని అంచనా వేసేందుకు విద్యా సంస్థల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సాకారమవుతున్న ఐటీడీఏ పీవో రాహుల్ ప్రయత్నం

విద్యాశాఖపై తొలి నుంచి మక్కువ చూపుతున్న భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్.. వారిలో సామర్థ్యాల పెంపునకు చేపట్టిన ప్ర యత్నం సాకారమవుతోందని తెలుస్తోంది. గత ఏడాది ఉద్దీపకంతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగడంతో ఉద్దీపకం-2 ద్వారా ఇది మ రింతగా గిరి బిడ్డలకు మేలు జరుగుతుందని భావించి పీవో వాటిని రూపొందించేందుకు చర్యలు తీసుకున్నారు.

ఈ నేపథ్యంలో పీవో ప్రయత్నం సాకారమవుతోందని అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బాలిక ప్రసవం

- శిశువు దత్తతకు ప్రయత్నం
- అడ్డుకున్న అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 15ఏళ్ల బాలిక పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. దీంతో ఏం చేయాలో పాలుపోక బాలిక తల్లిదండ్రులు పుట్టిన శిశువును దత్తత ఇచ్చేందుకు ప్రయత్నించగా.. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్, వైద్యాశాఖ అధికారు లు అడ్డుకున్న ఘటన ఖమ్మం జిల్లాలో శనివారం చోటు చేసుకుంది.

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15ఏళ్ల బాలిక శనివారం రాత్రి ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆడశిశువుకు జన్మనిచ్చింది. పెళ్లి కాని ఆ బాలిక భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని బాలిక తల్లిదండ్రులు శిశువును దత్తత ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఈవిషయమై ఐసీడీఎస్ డీడబ్ల్యూవో, వైద్య అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆస్పత్రికి చేరుకున్న అధికారులు ఘటనపై విచారణ చేపట్టారు. ఆ బాలిక తొలుత శిశువును దత్తత ఇవ్వాలని అనుకున్నప్పటికీ.. ఆ తర్వాత మనసు మార్చుకుని తామే సాదుకుంటామని తెలపడంతో అధికారులు ఆ శిశువును సంరక్షణతో పాటు పర్యవేక్షణను మహబూబాబాద్ జిల్లా డీడబ్ల్యూవో అధికారులకు అప్పగించారు. అయితే సర్జరీ ద్వారా శిశువుకు జన్మనిచ్చిన ఆమె మూడు రోజు ల పాటు ఆసుపత్రిలోనే ఉండాల్సి వస్తుంది. సోమవారం బాలికను డిశ్చార్చి చేయనున్నట్టు ఆసుపత్రి యాజమాన్యం తెలిపిం ది. కాగా.. ఈ బాలిక మరిపెడ పోలీసుస్టేషన్‌లో లైంగిక వేధింపులకు గురైనట్టు పోక్సో కేసు నమోదయినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో బాలిక గర్భం దాల్చి శిశువుకు జన్మనివ్వడం గమనార్హం.

ఉత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు
- జిల్లాలో ముస్తాబైన ఆలయాలు



కొత్తగూడెంలోని బూడిదగడ్డ మహంకాళి ఆలయం

కొత్తగూడెం సాంస్కృతికం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సోమవారం నుంచి జిల్లావ్యాప్తంగా దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తొమ్మిది రోజుల పాటు జరగనున్న దుర్గాదేవి అమ్మవారి నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారిని రోజుకొక రూపంలో విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తొలి రోజు బాలత్రిపురసుందరీ దేవీ రూపంలో పూజలందుకోనున్న దుర్గాదేవి.. విభిన్న రూపాల్లో భాగంగా మూల నక్షత్రం రోజు సరస్వతీదేవిగా, దుర్గాష్టమి రోజున దుర్గాదేవిగా (మహిషాసురమర్దిని దేవి) అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనుంది. భక్తులు ప్రతీరోజు విశిష్ట నైవేద్యాలు సమర్పిస్తూ అమ్మవారిని ఆరాధించనున్నారు. లోకమాత దుర్గాదేవి కరుణ కటాక్షాలతో చూడాలని వేడుకుంటూ నవరాత్రి మహోత్సవాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా భక్తులు కంకణాలు కట్టుకుని భవానీ దీక్షలు చేపట్టి భక్తి శ్రద్ధలతో పూజలు చేయనున్నారు. ఈ ఏడాది తిథి ద్వైయం రావడంతో 11 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పండితులు తెలిపారు. అదే విధంగా వాడవాడలా ఉత్సవ మండపాలను వేసి నిర్వాహకులు దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఉత్సవ కమిటీ నిర్వాహకులు విభిన్న రూపాలలో ఉన్న అమ్మవారిని మండపాలలో కొలువు దీర్చి ప్రత్యేక అలంకరణలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొత్తగూడెంలో బూడిదగడ్డ శ్రీమహంకాళి ఆలయం, గణేష్ టెంపుల్ స్వర్ణదుర్గాదేవి ఆలయం, త్రిమాతపంచాయాతన క్షేత్రం, మెయిన్ హాస్పిటల్ ఏరియా శ్రీదుర్గామల్లేశ్వరి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నేటి అర్ధరాత్రి నుంచి..
మిషన్ భగీరథ కార్మికుల సమ్మె

- జిల్లా వ్యాప్తంగా 21 మండలాల్లో మంచినీటి సరఫరా బంద్
- జేసీతో విఫలమైన చర్చలు
- సమ్మెకు పిలుపునిచ్చిన జేఏసీ నాయకులు

తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ జిల్లా వ్యాప్తంగా గల 21 మండలాల్లో మిషన్ భగీరథ కార్మికులు సోమవారం ఆర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగుతున్నట్లు కార్మిక జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు మద్దెల రవి, బత్తుల కిషోర్ ఆదివారం కల్లూరులో ప్రకటించారు. గత మూడు నెలల వేతనాల చెల్లింపు విషయమై భగీరథ కార్మిక జేఏసీ నాయకులతో జేసీ శ్రీనివాసరెడ్డి ఆదివారం చర్చలకు పిలిచారు. కాగా చర్చల్లో ప్ర ధానంగా జూన్ నెలకు సంబంధించిన వేతనం మాత్రమే చెల్లింపు జరిగేలా చూస్తానని ఆయన కార్మిక నాయకులు హామీ ఇవ్వడంతో వారు అంగీకరించలేదు. ఈ చర్చల్లో ప్రధానంగా తమకు జూన్ నుంచి ఆగస్టు వరకు వేతనాలు అందిస్తేనే తమ ఆందోళన విరమిస్తామని కార్మిక జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. మూడు నెలల వేతనం అందించే విషయమై జేసీ తమకు స్పష్టమైన హామీ ఇవ్వక పోవడంతో ఈ చర్చలు విఫలమైనట్లు వారు వివరించారు. గత ఆగస్టు 23న పెండింగ్ వేతనాల విషయమై తాము జిల్లా వ్యాప్తంగా ధర్నా చేయగా వైరా రిజర్వాయిర్ వద్ద జరిగిన చర్చల్లో సెప్టెంబరు 7లోగా రెండు నెలల వే తనాలు అందిస్తామని తమతో జరిపి చర్చల్లో భగీరథ చీఫ్ ఇంజనీర్, ఎస్ఈ, ఎల్అండ్‌టీ కంపెనీ మేనేజర్‌లు హామీ ఇచ్చారని కాని నేటి వరకు అది అమలు జరగలేదన్నారు. గత్యంతరంలేని పరిస్థితుల్లో తాము జిల్లా వ్యాప్తంగా జేఏసీ తరుపున సోమవారం అర్ధరాత్రి నుంచి తమ విధులను బహిష్కరించి సమ్మెబాట పట్టనున్నట్లు వారు స్పష్టం చేశారు.

మూడు నెలలు వేతనాలు అందకపోవడంతో మిషన్ భగీరథ కార్మికులు సోమవారం అర్ధరాత్రి నుంచి విధులను బహిష్కరించి స మ్మెకు దిగుతున్నారు. దీంతో జిల్లాలో గల17 మండలాల్లో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా నిలిచి పోనున్నది. ఆదివారం జిల్లా కేంద్ర మైన ఖమ్మంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో జేఏసీ నాయకులతో జరిపిన చర్చలు విఫలం కావడంతో భగీరథ పథకంలో పనిచేస్తున్న 500 మంది కార్మికులు సమ్మెకు సిద్ధమైనారు.

ప్రధాన డిమాండ్స్....

కనీస వేతనం అమలు చేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని, ఆశాలకు, పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం తరపున అందిస్తున్న విధంగా వేతనాలు అందిచాలని తదితర సమస్యలపై ప్రభుత్వం పరిష్కారించాలని కోరుతూ తాము ఆందోళన చేయాల్సి వస్తుందని జేఏసీ నాయకులు మద్దెల రవి, బత్తుల కిషోర్, కల్లూరు డివిజన్ భగీరథ కార్మిక సంఘం అధ్యక్షుడు అజ్మీర లక్ష్మణ్, ఉబ్బన వేణుబాబు, కార్మికులు ఎదుళ్ల రాజేష్, రమేష్‌లు తెలిపారు.

భద్రాద్రిలో ఎస్పీబీ సంగీత లహరి

హాజరైన హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు


న్యాయమూర్తి భీమపాక నగేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

భద్రాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీబీ) వర్ధంతి సందర్భంగా భద్రాచలంలో ఆదివారం నటరాజ్ ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో సంగీత లహరి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మానికి హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో వేల పాటలను తన గాత్రంతో ఆలపించి తెలుగువాడి ఖ్యాతిని ముందుకు నడిపించిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయులన్నారు. అనంతరం న్యాయమూర్తి నగేష్, ఎమ్మెల్యే వెంకట్రావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సరెళ్ల నరేష్, ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, దొడ్డిపట్ల సత్యలింగం, ధనకొండ రాఘవయ్య, డాక్టర్ విజయరావు, డాక్టర్ ఉదయ్, బూర్గంపాడు మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, తాళ్లూరి శ్రీహరి, సరెళ్ల వెంకటేష్, గౌతమ్‌రెడ్డి, సుధాకర్ రాగం పాల్గొన్నారు. ఇదిలా ఉండగా భద్రాచలంలోని అయ్యప్పస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ నంబూద్రి అరుణ్ రామచంద్రన్ అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించి ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ సీనియర్ జట్టు ఎంపిక


ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ సీనియర్ జట్టు క్రీడాకారులతో నిర్వాహకులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ సీనియర్ జట్టు ఎంపిక చేసినట్లు ఎంపిక కమిటీ సభ్యులు ఫాస్‌నెట్, ప్రేమ్‌కుమార్, జునైత్, నరేంద్రరాజు, డాక్టర్ వెంకన్న ఆదివారం వివరాలు వెల్లడించారు. తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన ఈ ఎంపికల్లో ఉమ్మడి జిల్లాల నుంచి 66మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 20మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారిలో చంద్రశేఖర్, వీరబాబు, వినోద్, అమర్, అశ్రిద్, శివ, గోపి, పవన్‌కుమార్, సిద్ధివిఘ్నేశ్వర, గోపిచంద్, హర్షిత్, వీరభద్రం, భరత్, అరుణ్, ఖాజా, శివశంకర్, రాజశేఖర్, ఖయ్యూం, భరత్ కుమార్, కె.వెంకటేశ్వర్లు ఉన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 25న మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

కేటీపీఎస్‌లో పట్టాలు తప్పిన బొగ్గు వ్యాగన్లు

పాల్వంచ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ 7వ దశలో శనివారం రాత్రి బొగ్గు వ్యాగన్లు పట్టాలు తప్పాయి. సింగరేణి నుంచి కేటీపీఎస్‌కు బొగ్గు సరఫరా చేసే క్రమంలో కోల్ యార్డు సమీపంలో సుమారు రాత్రి 8గంటల ప్రాంతంలో ర్యాక్‌లోని రెండు వ్యాగన్లు పట్టాలు తప్పడంతో సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న కోల్ ప్లాంట్ అధికారులు వెంటనే రైల్వే అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది రాత్రి 10 గంటలకు సంఘటనా స్థలానికి చేరుకుని కేటీపీఎస్ సిబ్బందితో కలిసి మరమ్మతు పనులు చేపట్టి, అర్ధరాత్రి 1 గంటకు వ్యాగన్లను యథాస్థానంలో ఉంచారు. అనంతరం బొగ్గును అన్‌లోడ్ చేశారు. ఏదైనా కారణాలతో ఆలస్యమైతే గంటల లెక్కన రైల్వే అధికారులు కేటీపీఎస్ సంస్థ నుంచి డ్యామరేజ్ చార్జస్ వసూలు చేస్తారు. శనివారం రాత్రి జరిగిన సంఘటన మానవతప్పిదంవల్ల జరిగిందా లేక సాంకేతిక లోపమా అనే కోణంలో అధికారులు విచారణ చేస్తున్నారు. రైల్వే అధికారులు సైతం ఈ విషయంపై విచారణ చేసి వారి నివేదికను కేటీపీఎస్ అధికారులకు అందజేయనున్నారు. ఈ విషయంపై కోల్ ప్లాంట్ ఎస్ఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా వ్యాగన్లు పట్టాలు తప్పగానే రైల్వే అధికారులకు సమాచారం అందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతు చర్యలు పూర్తి చేశామని, ఎటువంటి ఆస్తినష్టం జరుగలేదని తెలిపారు.

క్యాన్సర్ అంటు వ్యాధికాదు

బాధితులను అక్కున చేర్చుకొని ఆదరించాలి

లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం ఆధ్వర్యంలో అవగాహన

నేడు ప్రపంచ గులాబీ డే (క్యాన్సర్ బాధితుల సాంత్వన దినం)



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. ఈ పేరు వింటేనే మనిషి గుండెల్లో గుబులు పుడుతుంది. ఎక్కువశాతం మృతి చెందే వారిలో తొలి స్థానం గుండె సంబంధిత వ్యాధి ఉండగా, రెండో స్థానం క్యాన్సర్‌కు ఉంది. ప్రతి ఆరు మరణాలకు ఒక మృత్యువు క్యాన్సర్‌తోనే జరుగుతుందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. క్యాన్సర్ అంటు వ్యాధి కాదు. ఈ మహమ్మారిని ముందస్తుగా గుర్తించేందుకు ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగించే ఉద్దేశంలో భాగంగా సినిమా థియేటర్లో మూవీ ప్రారంభానికి ముందు క్యాన్సర్‌పై ప్రకటనలు ఏర్పాటు చేసి ఈ వ్యాధిని నిర్మూలించేందుకు ముందస్తు చర్యలు చేపట్టేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మానవ శరీరంలో ఒక కణంతో ప్రారంభమయ్యే ఈ క్యాన్సర్ కణజాలాలకు వ్యాప్తి చెంది న్యూక్లియస్ చెడిపోయి తీవ్ర అనారోగ్యానికి గురై. మానసిక స్థితి కోల్పోతారు. ఈ వ్యాధి బాధితులను ప్రపంచమే వెలివేసినట్లుగా బాధపడుతున్న వారిని అక్కున చేర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఆప్యాయత, అనురాగాలతో క్యాన్సర్ బాధితులను ఆదరిస్తే వారు ఆనంద జీవనాన్ని సజావుగా కొనసాగిస్తారన్నారు. సోమవారం (ప్రపంచ గులాబీ డే) క్యాన్సర్ బాధితుల సాంత్వన దినం సందర్భంగా ప్రత్యేక కథనం .

క్యాన్సర్ బాధితులను అక్కున చేర్చుకొనే గులాబి డే

ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ బాధితులను గౌరవించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబరు 22న ప్రపంచ గులాబీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఆసుపత్రుల్లో క్యాన్సర్ రోగులకు గులాబీ పువ్వులను బహుమతిగా ఇవ్వడం లేదా క్యాన్సర్ చికిత్సా కేంద్రాలలో గులాబీలను అందిస్తే వారికి అండగా ఉన్నామని భరోసా కలుగుతుంది. లేని పక్షంలో క్యాన్సర్ చారిటీలకు విరాళం ఇవ్వడం, క్యాన్సర్ రోగులకు సహాయం అందించే, పరిశోధనల చేసే సంస్థలకు మద్దతు ఇవ్వడం వంటి వి చేపడుతున్నారు. రోగులకు ధైర్యం చెబుతూ, వారి స్థితిని గుర్తిస్తూ అవగాహనలు, నివారణ పద్ధతులు ముందస్తుగా నాలుగు దశలలో ఉన్న వ్యాధి, చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. క్యాన్సర్‌కు ఎన్నో చికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికిని శరీరంలో ఉన్న క్యాన్సర్ కణానికి శస్త్ర చికిత్స రేడియోథెరపీ, కీమోథెరపీ వంటి ప్రధాన చికిత్సలు ప్రస్తుతం అందిస్తున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ...

లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం మాజీ గవర్నర్, డాక్టర్ లయన్ సీహెచ్ శివకుమార్, టీజీవో భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు లయన్ సంఘం వెంకట పుల్లయ్య ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. కొత్తగూడెంలో ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ రోజాకిరణ్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించి ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తూ రోగులకు, క్యాన్సర్ బాధితులకు విలువైన సలహాలు, సూచనలు అందిస్తూ ఆదరిస్తున్నారు. ముందస్తుగా క్యాన్సర్‌ను గుర్తిస్తే శాశ్వతంగా నిర్మూలించవచ్చని, సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు సైనికుల్లా పని చేస్తున్నారు. అదేవిధంగా స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధితులకు అవగాహన కల్పించడం, నివారణకు మద్దతు తెలియజేస్తూ నిర్మూలించేందుకు అడుగులు వేయడం గర్వించదగ్గ అంశం. క్యాన్సర్ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు అడుగు వేస్తూ బాధ్యతగా వ్యవహరించడం స్వాగతించే విషయం అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తగూడెం ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ రోజాకిరణ్ (ఫైల్)

ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో
మర్చంట్స్ అసోసియేషన్ విలీనం


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని క్రిష్ణారావు

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ది ఖమ్మం మర్చంట్స్ అసోసియేషన్ విలీనమైనట్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని క్రిష్ణారావు, మెంతుల శ్రీశైలం పేర్కొన్నారు. ఆదివారం వర్తక సంఘ భవన్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. సుమారు 18 వాణిజ్య సంఘాల నుంచి 750 మంది సభ్యులు మర్చంట్స్ అసోసియేషన్ సభ్యుల ఆశయం మేరకు ఏకగ్రీవ అమోదంతో విలీనాన్ని తీర్మానించినట్లు తెలిపారు. ఇక నుంచి ఛాంబర్ ఆఫ్ కామర్స్ పూర్తి చట్టబద్ధతతో రూపుదిద్దుకుందని, ప్రత్యేక బైలా, బ్యాంక్ ఖాతా, వర్తక సంఘ బిల్డింగ్ నిర్వహణ అన్నీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పేరుతో జరుగుతాయని వారు తెలిపారు. మా సంఘ భవనం మా ఆధీనంలో ఉందని ఎవరైనా అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు జీవై నరేష్, మాజీ సెక్రెటరీ గొడవర్తి శ్రీనివాసరావు, ట్రెజరర్ తల్లాడ రమేష్ తదితరులు ఉన్నారు.

రైతుపై చేయి చేసుకున్న బీట్ అధికారి

కాచనపల్లి రేంజ్, వలసల్ల సెక్షన్‌లో ఘటన

రైతుపై చేయి చేసుకోలేదని బీట్ అధికారి వివరణ


మాట్లాడుతున్న బాధిత రైతు, పార్టీ నాయకులు

ఆళ్లపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) ఆళ్లపల్లి మండలం, రాఘవాపురం పంచాయతీ చంద్రాపురం గ్రామంలోని ఓ రైతుపై అటవీశాఖ అధికారి చేయి చేసుకున్న సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బాధిత రైతు మాట్లాడుతూ.. చంద్రాపురం గ్రామానికి చెందిన గొగ్గల బుచ్చయ్య, గొగ్గల లక్ష్మి భార్యభర్త రైతులు శనివారం కాచనపల్లి రేంజ్‌లోని, వలసల్ల వెస్ట్ బీట్‌లో మొక్కజొన్న చేను వద్ద కోతులు కాపల కాస్తున్నారు. ఈ క్రమంలో అటుగా వచ్చిన వలసల్ల సౌత్ బీట్ అటవీశాఖ అధికారి, గొగ్గల లక్ష్మి మహిళ రైతు ఉన్న మంచే దగ్గరకు వెళ్లి, పంట దగ్గరలో ఉన్న చెట్లు ఎందుకు నరికావు అంటు ఆవేశంలో మొక్కజొన్న పంట చూట్టు ఉన్న విద్యుత్‌పెన్సింగ్, కోతుల వలను తొలగించి, విద్యుత్ మీటర్ తీసుకెలుతుండగా,లక్ష్మి భర్త బుచ్చయ్య మీటర్ ఇచ్చేయ్యండి సార్.. తప్పైంది అంటు అటశాఖ అధికాని ప్రాదేయపడినాడు. అయినా ఆ అధికారి నాకు కోపం తగ్గితే ఇస్తాను.. లేదంటే ఇవ్వనని దుర్భాషలాడుతూ.. బుచ్చయ్యపై చేయి చేసుకుని దౌర్జన్యంగా నాలుగు దెబ్బలు కొట్టాడని భార్య ఆరోపించింది. ఆదివాసీలపై లంబాడా అధికారులు కావాలనే ఇటువంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, చేయి చేసుకున్న అటవీశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు గొగ్గల శ్రీను, పాయం సత్యనారాయణ ఆరోపించారు. ఈ విషయమై వెస్ట్ బీట్ అటవీశాఖ అధికారి బేబిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా చెట్లు నరుకుతున్నారని, నా తోటి అటవీశాఖ అధికారి రైతును హెచ్చరించాడు, చేయిచేసుకున్నది అనే మాట అవాస్తవం అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో ఆదివారం జరిగింది. ఆంధ్రాలోని జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం గ్రామానికి చెందిన కె.మంగరాజు, పి.దుర్గారావు అనే వ్యక్తులు ద్విచక్రవాహనంపై రాచన్నగూడెం వెళుతున్నారు. మండలంలోని రామన్నగూడెం సమీపంలోని మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో దుర్గారావు కాలు విరిగడంతో పాటు మంగరాజుకు కుడికాలు వేళ్లు చితికిపోయాయి. క్షతగాత్రులను అశ్వారావుపేట ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం వారిని జంగారెడ్డిగూడెం తరలించారు.

రైలునుంచి జారిపడి విద్యార్థికి తీవ్రగాయాలు

కారేపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాంధీనగరం రైల్వేస్టేషన్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి ఆదివారం రైలు దిగుతున్న క్రమంలో జారిపడి తీవ్రంగ గాయపడ్డాడు. వివరాలు ఇలా.. విజయవాడ నుంచి భద్రాచలం రోడ్డు ప్యాసింజర్ రైలు ఎక్కిన ఇల్లెందు పట్టణానికి చెందిన భార్గవ్ రైలుదిగుతూ ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో భార్గవ్ తలకు బలమైన గాయలు కావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముదిగొండ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీఐ మురళీ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కృష్టాపురం వద్ద పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణా చేపడుతున్నారనే సమాచారంపై కృష్టాపురం వద్ద దాడిచేసి ఏపీలోని జగ్గయ్యపేట మండలం మల్కాపురం నుంచి రెండు ఇసుక ట్రాక్టర్లు, పెద్దమండవ నుంచి వస్తున్న మరో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఖమ్మం నగర శివారులో అగ్నిప్రమాదం

ఖమ్మంక్రైం, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): నగర శివారులో ఓ ఇంటిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. 16వ డివిజన్ కొత్తూరుకు చెందిన మారగాని వెంకట్ ఇంట్లో ఆదివారం ఉదయం 7గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గమనించిన కుటుంబసభ్యులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే ఇంటిలో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు సామాన్లు సైతం దగ్ధమయ్యాయి. కాగా షార్టు సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్టు తెలుస్తుంది. దీంతో సుమారు రూ.20లక్షల ఆస్థినష్టం జరిగినట్లు ఇంటి యజమాని తెలిపారు.

బుల్లెట్ సైలెన్సర్ మారిస్తే కేసులు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ సైలెన్సర్ మార్చి రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయాందోళలనకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నెంబరు ప్లేటు అసంపూర్తిగా ఉన్న వాహనాలకు జరిమానాలు విధిస్తామని, వాహనదారులు తప్పకుండా రవాణశాఖ నిర్దేశించిన రీతిలో నెంబరు ప్లేట్లు, సైలెన్సర్లు ఉండేలా చూసుకోవాలన్నారు.

పాము కాటుకు రైతు మృతి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుకు గురై రైతు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని తిరుమలాయపాలెం మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన బొమ్మనపల్లి వీరన్న (53) తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆ పొలంలో పత్తి, వరిసాగు చేశాడు. రోజూలాగే ఆదివారం ఉదయం కూడా వీరన్న పొలానికి వెళ్లి పత్తిచేనులో అరక దున్నుతున్నాడు. ఈ సందర్భంగా పత్తిచేలో ఉన్న విషపూరిత పింజరపాము అతన్ని కాటేసింది. దీంతో రైతు ఆ పామును చంపి కుటుంబసభ్యులకు చూపాడు. భయపడ్డ కుటుంబసభ్యులు వీరన్నను గ్రామంలోని నాటు వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. వీరన్న పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబీకులు ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు గుర్తించారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక సేవలో ఎక్సైజ్ మహిళా సీఐ


మేచర్ల రాధా, ఎక్సైజ్ సీఐ

కల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కల్లూరు ప్రాంతానికి చెందిన ఓ ఎక్సైజ్ మహిళా సీఐ ఆధ్యాత్మిక సేవలో తరిస్తూ పరిసర గ్రామాల భక్తుల మన్ననలను పొందుతున్నారు. మరోవైపు ఎక్సైజ్ శాఖ (మెదక్)లో సీఐగా పనిచేస్తూ ఆధ్యాత్మికంగా ఓ దేవాలయ నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. కల్లూరు పట్టణంలోని తిరువూరు క్రాస్ రోడ్డు వైపు గత 25 ఏళ్ల క్రితం వెలసిన శ్రీశ్రీశ్రీ మారెమ్మ అమ్మవారిని స్థానిక ఎస్టీ కాలనీకి చెందిన రాధా కుటుంబ సభ్యులు కొలుస్తూ వస్తున్నారు. అమ్మవారి ఆశీస్సులతో తాము ఉన్నతంగా ఎదిగామనే విశ్వాసంతో ఆ కుటుంబంలోని తల్లిదండ్రులు మేచర్ల నాగమల్లేశ్వరరావు, మాణిక్యమ్మలు గత ఐదు సంవత్సరాల క్రితం ఆలయ నిర్మాణం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు ముందుకు వచ్చారు. దాతల సహకారంతో ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేశారు. ప్రతి ఏడాది అమ్మవారి ఆలయంలో ఆషాడ మాసంలో బోనాల జాతర ఉత్సవాలు, శ్రావణమాసంలో వరలక్ష్మీవ్రత పూజ కార్యక్రమాలు, దసరాకు దేవీ నవరాత్రులు (బతుకమ్మ ఉత్సవాలు), ప్రతీ ఏడాది డిసెంబరు నెలలో అమ్మవారి ఆలయ విగ్రహప్రతిష్ఠ మహోత్సవ వార్షికోత్సవం, జాతర వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.


ముస్తాబైన మారెమ్మ ఆలయం

బాలుడి కిడ్నాప్‌కు యత్నం

చాక్లెట్ ఇస్తానని ఆశచూపి కారు ఎక్కించుకున్న గుర్తు తెలియని వ్యక్తులు

సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేస్తున్న టూటౌన్ పోలీసులు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): సైకిల్ తొక్కుకుంటూ వెళ్తున్న ఇద్దరు బాలురలను ఆపి, ఓ బాలుడ్ని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం ఖమ్మం నగరంలో జరిగింది. టూటౌన్ పోలీసులు తలిపిన వివరాల ప్రకారం నగరంలోని బ్యాంకుకాలనీకి చెందిన మారుతి యలమందరావు కుమారుడు సాయితేజ నగరంలో ఓ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. అదే విధంగా ఉపేంద్రనగర్‌కు చెందిన ఒట్టికొమ్ము విజయపాల్‌రెడ్డి కుమారుడు మనస్విన్‌రెడ్డి ఏవో తరగతి చదవుతున్నాడు. వీరిద్దరూ మంచి స్నేహితులు. వీరు ఆదివారం మధ్యాహ్న సమయంలో సైకిల్ తొక్కేందుకు గట్టయ్యసెంటర్ వైపు వెళ్లారు. సమీప ప్రాంతంలో ఓ నల్లకారులో వచ్చిన వ్యక్తులు సైకిల్‌పై వెళుతున్న బాలురలను ఆపారు. ఇద్దరిలో వెనక కూర్చున్న సాయితేజను కారులో ఉన్న గుర్తుతెలియని వ్యక్తులు పిలిచి కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం సాయితేజను చాక్లెట్ ఇస్తాను ఇక్కడ వరకు వెల్దొద్దామని బలవంతంగా కారుఎక్కించే ప్రయత్నం చేశారు. వెంటనే సాయితేజ కేకలువేసి వారినుంచి తప్పించుకుని పక్కసందులోకి పారిపోయాడు. అదేవిధంగా పక్కనున్న మరో బాలుడు మనస్విన్‌రెడ్డి భయంతో సైకిల్‌పై పారిపోయాడు. కారులో ఉన్న వారు సైకిల్ వెళ్లే బాలుడి వెనుక కొద్దిదూరం వెళ్లారు. గట్టయ్య సెంటర్‌లోని సాయిబాబా గుడిరోడ్డులో నుండి సైకిల్‌పై వెళ్తున్న బాలుడు తప్పించుకోడంలో కారులోని వ్యక్తులు గట్టయ్య సెంటర్ మెయిన్‌రోడ్డు మీదగా పటేల్‌స్టేడియం వైపు వెళ్లారు. పారిపోయి ఇంటికి వచ్చిన బాలురు జరిగిన విషయం తల్లిదండ్రులకు తెలపడంతో వారు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలిసిన టూటౌన్ ఎస్ఐ వెంకటేష్ బాలురు వద్దకు వెళ్లి సంఘటన స్థలం వద్ద పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోని సీసీ కెమెరాల ద్వారా వివరాలు సేకరించారు. కారులోని వ్యక్తులు ఎవరో తెలియకపోవడంతో మిగతా ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల నుంచి సమాచారం మాత్రమే వచ్చిందని, ఎలాంటి ఫిర్యాదు అందలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురు రిమాండ్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన సంఘటన కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆదేశాల ప్రకారం సిబ్బందితో కలిసి రైటర్ బస్తీలోని రైల్వేట్రాక్ పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులు కనిపించారు. దీంతో వారి వివరాలను ఆరా తీయగా లోకేష్, కలీం, భాస్కర్‌లుగా తెలియజేశారు. ఈ ప్రాంతంలో గంజాయి సేవించేందుకు వచ్చినట్లు నిర్ధారించి వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వేస్టేషన్ మూడో నెంబర్ ప్లాట్‌ఫారం సైకిల్‌స్టాండ్ వద్ద ఓ వృద్ధుడు మృతిచెందాడు. సుమారు 75 ఏళ్ల వయస్సున్న వృద్ధుడు చనిపోయాడన్న సమాచారం రావడంతో త్రీటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం వృద్ధుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్.. డ్రైవర్ మృతి

మితి మీరిన వేగమే కారణమా?

నేలకొండపల్లి, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బుద్దారం కబరస్తాన్ సమీపంలో ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టరు ఆదివారం తెల్లవారుజామున బోల్తా పడటంతో డ్రైవర్ భూక్యా వస్రం(17) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా, అనంతగిరి మండలం, కొత్తగూడెం తండాకు చెందిన భూక్యా వస్రం ఆదివారం రాత్రి పాలేరు వాగు నుంచి ఇసుకను ట్రాక్టరులో లోడు చేసుకున్నాడు. ఇసుక లోడుతో గోండ్రియాల వైపు వెళుతుండగా, ఆదివారం తెల్లవారుజామున నేలకొండపల్లి మండల పరిధిలోని బుద్దారం సమీపంలో కబరస్తాన్ వద్ద ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్‌ను నడుపుతున్న వస్రం అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తున్నది. పాలేరు వాగు నుంచి ఇసుకను రాత్రి వేళ అక్రమంగా రవాణా చేస్తున్నారు!. ఈ మేరకు ఎవరైనా పట్టుకుంటారేమోనన్న భయంతో అతి వేగంగా నడపటమే ట్రాక్టర్ బోల్తా పడటానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ట్రాక్టర్‌ను నడుపుతున్న వస్రం మైనర్ కావటం గమనార్హం. ట్రాక్టర్ కొత్తగూడెం తండాకి చెందిన తేజావత్ శారదకు చెందినదని పోలీసులు తెలిపారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న నేలకొండపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి తండ్రి భూక్యా చోక్లా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిన్నెరసాని ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల

మూడు గేట్లు ఎత్తి దిగువకు వదిలిన 13 వేల క్యూసెక్కుల నీరు

పాల్వంచ రూరల్, సెప్టెంబరు21, (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయంకు ఎగువ నుంచి భారీగా వరద నీరు చేరడంతో ఆదివారం మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాలైన పాకాల కొత్తగూడెం, గుండాల , ఇల్లందు, టేకులపల్లి నుంచి వరద నీరు జలాశయానికి చేరడంతో నీటిమట్టం 406.10 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 4వేల క్యూసెక్కుల చొప్పున చేరుతుండడంతో మూడు గేట్లను ఎత్తి 13 వే క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు వాగు దాటవద్దని ప్రాజెక్టు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ముందస్తుగా పాల్వంచ, బూర్గంపాడు మండల అధికారులకు సమాచారం ఇచ్చారు.

ఆన్‌లైన్ చైన్‌లింక్ పేరుతో మోసం

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ కంపెనీ పేరుతో ఘరానా మోసానికి పాల్పడ్డారు. ప్రతిరోజు మీ అకౌంట్‌లో డబ్బులు పడతాయంటూ లక్షల్లో ఆశచూపి నగదు వేయకుండా బోర్డు తిప్పేశారు. ఇల్లెందు పట్టణంలో కొంతమంది ఎంఎస్‌క్యూ అనే ఆన్‌లైన్ కంపెనీ పేరుతో రూ.17,500 ఒక్కసారి కడితే అకౌంట్‌లో ప్రతి రోజూ రూ.500 జమ అవుతాయంటూ నమ్మబలికారు. ఈ మేరకు సుమారు 200 మంది వద్ద డిపాజిట్లు సేకరించినట్లుగా ప్రచారం సాగుతోంది. బాధితుల్లో కొందరు వ్యాపారవేత్తలు, స్థానికులు, ఆర్‌ఎంపీలు, చిన్న వ్యాపారస్థులు, పేదలు కూడా డబ్బులు కట్టి మోసపోయారు. ఇల్లెందులో ఈ కంపెనీ కార్యాలయం రెండు రోజుల క్రితమే బోర్డు తిప్పేయ్యడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ మేరకు ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లుగా బాధితులు పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల పోలీసులు ప్రచారం చేస్తున్నప్పటికీ ఇలాంటి మోసాలు ఆగకపోవడం గమనార్హం.

గోడ కూల్చడంపై కేసు నమోదు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థలంకు నిర్మించిన ప్రహరీ కూల్చివేసిన ఘటనపై ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెలుగుమట్ల రెవెన్యూలోని టీఎన్జీవోస్ కాలనీలో పోపురి రవిమారుతికి నాలుగు ప్లాట్లు ఉన్నాయి. వీటికి ప్రహరీ నిర్మించగా గోవిందరావు అనే వ్యక్తి కూల్చివేశాడు. కూల్చివేతను అడ్డుకోబోయిన నరేష్‌ను నెట్టివేశాడు. దీంతో రవి మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఖానాపురం హవేలి పోలీసులు తెలిపారు.



నిరుపేద విద్యార్థినికి లయన్స్ క్లబ్ చేయూత

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ప్రముఖ న్యూరో ఫిజిషియన్ జగదీష్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థికి అండగా నిలిచారు. ఆదివారం ఖమ్మం నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న బాణోత్ గీతికకు చేయూతను అందించారు. చదువుకు అవసరమయ్యే విధంగా రూ.40వేల విలువగల ల్యాప్‌ట్యాప్‌ను, ఫీజు నిమిత్తం రూ.21,500 నగదును నగరంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం విద్యార్థినికి అందజేశారు. ల్యాప్ టాప్‌ను లయన్ మోతుకూరి మురళీధర్రావు కూతురు బి.మౌనిక అందించగా, నగదును క్లబ్ సభ్యులు సహకారంతో అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చిన మార్కెట్ పంచాయితీ

- మెప్మా మార్కెటింగ్ అధికారుల సర్వే పూర్తి
- 165 మంది వ్యాపారుల గుర్తింపు
- సర్వేను తొలుత అడ్డగించిన నాయకులు, వ్యాపారులు




సర్వేను అడ్డుకుంటున్న నాయకులు,వ్యాపారులు, వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా వివాదంగా సాగుతున్న ఖమ్మం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కూరగాయల మార్కెట్ పంచాయితీ ఓ కొలిక్కి వచ్చింది. వీధివ్యాపారుల మార్కెట్ పేరుతో దశబ్దకాలంగా నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్‌ను ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ.1.20 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అయితే మార్కెట్ నిర్వహణ, ధరలు అడిగిన వారిపై దాడులు జరగటంతో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టి సారించారు. వాస్తవంగా కూరగాయల వ్యాపారం చేసే వారి వివరాలను సేకరించాలని మెప్మా అధికారులకు ఆదేశించారు.

సర్వేను అడ్డగించిన వ్యాపారులు

వీధివ్యాపారుల మార్కెట్‌ను ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మార్కెట్‌గా మార్పులు చేశారు. విధానపరమైన నిర్ణయాల్లో భాగంగా కూరగాయలు అమ్మకాలు జరిపే వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కేఎంసీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా కేఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, మార్కెటింగ్ ఎస్టేట్ అధికారి శివకృష్ణలు మార్కెట్‌లో వ్యాపారుల ఆధార్, గుర్తింపు కార్డులపై సర్వే చేపట్టారు. కాగా కొంతమంది వ్యాపారులు తమ ఆధార్‌కార్డులను ఇవ్వటానికి అంగీకరించలేదు. స్థానికంగా ఉన్న ఓనాయకుడుకి వ్యాపారులు ఫోన్లు చేశారు. అక్కడకు చేరుకున్న నాయకులు ఇప్పుడు సర్వే చేయవొద్దని మార్కెట్‌లో అన్ని సౌకర్యాలు కల్పించిన తర్వాత తాను చెప్పినప్పుడు సర్వే చేయాలని టీఎంసీ, మార్కెటింగ్ అధికారి ఎదుట గొడవ చేశారు. ఫొటోలు తీస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బందిని బెదిరించారు. అయినా అధికారులు ఓపిగ్గా గంట పాటు వాదనలు విన్నారు. తాము గుర్తింపు కార్డులు ఇవ్వటానికి మాత్రమే సర్వే చేస్తున్నామని వాస్తవంగా వ్యాపారాలు చేసే వారిని తొలగించే ఉద్దేశ్యం ఎవ్వరికి లేదని ఒప్పించారు. తర్వాత మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఎస్‌కే సల్మా, ఉపేంద్ర, ఆర్పీలు కొండ సునీత, కుల్లా ఉమా, డేటా ఎంట్రీ ఆపరేటర్ మేకల సంధ్య సర్వే కొనసాగించారు. మొత్తం 165 మంది వ్యాపారుల పేర్లు నమోదు చేశారు. వీరిలో 70 మంది వ్యాపారులు తమ ఆధార్‌కార్డులను అందించారు.డీఆర్‌ఎఫ్ బలగాలు భద్రతగా నిలిచారు. మార్కెట్‌లో బోర్డులు కనిపించకుండా ఏర్పాటు చేసిన పరదాలను తొలగించారు.

కాంగ్రెస్‌లో 40కుటుంబాల చేరిక

ఖమ్మంఅర్బన్, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఆదివారం పాలేరు నియోజకవర్గానికి చెందిన పలు కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తిరుమలాయపాలెం పాతర్లపాడు గ్రామానికి చెందిన ముదిరాజుల సామాజిక వర్గానికి చెందిన 40 కుటుంబాలు బీఆర్‌ఎస్, బీజేపీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. పాలేరు నియోజక వర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల్లో విశ్వాసం కలిగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్‌లో కొత్తగా చేరుతున్న వారికి సముచిత గౌరవస్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్ గౌడ్, నాయకులు జడల రమేష్, చీకటి శ్రీను, బాజా సత్యనారాయణ, నేలమర్రి నాగేందర్, సోమనబోయిన మహేష్, మల్లారపు యాకన్న, షేక్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంట్ను చేనేత వస్త్ర ప్రదర్శన



చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కళా సిల్క్స్ హస్తకళా చేనేత ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్స్, హ్యాండ్‌లూమ్స్, ప్రింటెడ్ శారీస్ కళంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్ శారీస్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యూయలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు.ఈప్రదర్శన వారంరోజులపాటు కొనసాగుతుందని మేనేజర్ సంజయ్ జైన్ తెలిపారు.

నేడు కేజీకేఎస్ జిల్లా సభ

ఖమ్మంరూరల్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లాఅధ్యక్షుడు బొడపట్ల సుదర్శన్‌రావు అన్నారు. మండలంలోని వరంగల్‌క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో ఆదివారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం మంచికంటి భవన్‌లో సోమవారం జరిగే ఈ సభకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కొండం కరుణాకర్, బొడపట్ల వెంకన్న, కోటయ్య, వెంకట్రావు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం అమావాస్య సందర్భంగా మహా అన్నదానం కార్యక్రమం జడ్పీ సెంటర్‌లో నిర్వహించారు. రామానుజ జీయర్ స్వామి వారి చిత్రపటానికి పూలమాలవేసి హారతి ఇచ్చారు. అన్నదానం కార్యక్రమాన్ని వికాస్ తరంగిణి జిల్లా అధ్యక్షుడు పోలస శ్రీనివాసరావు దంపతులు ప్రారంభించారు . సుమారుగా 650 మంది ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారేపల్లి లక్ష్మీనారాయణ , నాగమణి, ఉషా కన్య, రాధా, రమాదేవి పాల్గొన్నారు

గోదాణా అందజేత

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): స్థంభాద్రి సేవా సమితి వారి ఆధ్వర్యంలో భాద్రపద అమావాస్య సంద ర్భంగా ఆదివారం గోదాణా అందజేశారు.నగర పెద్దలు, దాల్ మిల్ యజమానులు, గ్రేయిన్‌మార్కెట్ వ్యాపారులు, మిత్రులు, సేవాసమితి సభ్యులు, గోభక్తుల ద్వారా దీన్ని సేకరించారు. సుమారు రూ.81వేల దాణాను గొల్లగూడెంలోని ఓం శ్రీకృష్ణ గోశాలకు, టేకులపల్లిలోని శ్రీవెంకటేశ్వర గోశాలకు, శ్రీలక్ష్మీ రంగనాథ గోశాలల ఈదాణా అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్‌తూములూరి లక్ష్మీనరసింహరావు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ బిల్లులు చెల్లించాలని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు కట్టశేఖర్ అన్నారు. ఆదివారం నగరంలోని సంఘంభవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు, మెడికల్ బిల్లులు సైతం నెలలు గడిచినా కూడా విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని అన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు మోత్కూరి మధు, వెంకట నరసయ్య, మాజీ జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, చిత్తలూరి ప్రసాదరావు, విజయ అమృత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా గుడిపుడి



కామేపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ జిల్లాఉపాధ్యక్షుడిగా నెమలిపురి తండ హెచ్ఎం గుడిపుడి శ్రీనివాసరావు ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు పిట్టల రాములు, ప్రధాన కార్యదర్శి వెంకన్న తెలిపారు. ఉపాధ్యక్షుడిగా జీ. సత్యనారాయణ, కార్యదర్శిగా ఎస్.సుధాకర్‌రెడ్డి ఎన్నుకున్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ధర్నా



ఖమ్మంఅర్బన్,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వులు తుంగలో తొక్కి దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ అన్నారు. సీపీఐఎంఎల్ (మాస్‌లైన్) కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పీడీఎస్‌యూ డివిజన్ సమావేశంలో మాట్లాడారు. చదువులు పేరుతో విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న విధానాన్ని అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడుశ్రీకాంత్, కార్యదర్శి పృథ్వీ, నాయకులు సందీప్, అశోక్, పేర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీకి నివాళులు



ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీకి జాతీయ బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. నగరంలోని లకారంట్యాంక్ బండ్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి ఆసంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, ప్రధాన కార్యదర్శి మసనం శివరామకృష్ణ, నగర అధ్యక్షుడు గద్దె వెంకటరామయ్య, మోడేపల్లి వెంకటాచారి పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు ప్రారంభం

కలెక్టరేట్‌లో తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



బతుకమ్మను తీసుకెళుతున్న హార్వెస్ట్ ప్రిన్సిపాల్



ఎస్సీబీ బాలికల వసతిగృహంలో..



టీడీపీ కార్యాలయంలో..



బీఆర్ఎస్ కార్యాలయంలో..



కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు

ఖమ్మంఖానాపురం హవేలి, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజుల పాటు సాగే ఆటపాటల పండుగ ఆదివారం నూతన కలెక్టరేట్‌లో ఎంగిలిపూల బతుకమ్మతో ఆరంభమైంది. కలెక్టరేట్‌లో మహిళలు, స్త్రీ-శిశు సంక్షేమశాఖల మహిళా ఉద్యోగులు అందరూ కలిసి బతుకమ్మ మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్ రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులందరిని ఒక దగ్గరికి చేర్చి, ప్రకృతితో మమేకమయ్యేలా చేసే పండుగ బతుకమ్మ అని అన్నారు.తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేది బతుకమ్మ పండుగ అని తెలిపారు. తెలంగాణ ఆడపడుచులు అంతా సంబరంగా జరుపుకునే వేడుక బతుకమ్మ అని,బంధాలను, అనుబంధాలను గుర్తుచేస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే పూల పండుగ బతుకమ్మ అని తెలిపారు. ఈ వేడుకల్లో కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, కేర్‌టేకర్ వెంకన్న,సీడీపీవోలు,కలెక్టరేట్ మహిళా అధికారులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ముస్తాబైన దుర్గాదేవి మండపాలు

ఖమ్మంరూరల్: నేటి జరగబోయే దుర్గాదేవి నవరాత్రులకు సంబంధించి గ్రామాల్లో మండపాలు ముస్తాబైయ్యాయి. తొమ్మిదిరోజులపాటు ప్రత్యేకపూజలు, తీరొక్క పూలతో దుర్గామాత అమ్మవారిని అలంకరించడం జరుగుతుంది. మండలంలోని తల్లంపాడు, ఆరెంపుల, వరంగల్ క్రాస్‌రోడ్డు, పెద్దతండా, గుర్రాలపాడు తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహలను ఏర్పాటు చేయడం జరుగుతుంది.

నేలకొండపల్లి: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచీ దేవీ శరన్నవరాత్రులు నిర్వహించటానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. సింగారెడ్డిపాలెం శ్రీరామమందిరం దేవీ శరన్నవరాత్రులకు ముస్తాబైంది. కట్టలమ్మ చెరువు వద్ద ఉన్న దేవాలయాల వద్ద, కూసుమంచి రోడ్డులో సోమవారం నుంచి దేవీనవరాత్రులు నిర్వహించటానికి ఏర్పాట్లు చేశారు. నేలకొండపల్లిలోని ప్రసిద్ధ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం నుంచీ అక్టోబరు3వరకు శ్రీస్వామి వారి అధ్యయన బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రామ మందిరంలో సోమవారం నుంచి అక్టోబరు 2వరకు నిర్వహించటానికి ఏర్పాట్లు చేసారు.

హార్వెస్ట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి హాజరై బతుకమ్మ వేడుకలలో పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు షురూ..

కూసుమంచి: మండలంలో బతుకమ్మ వేడుకలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మ పెరికశింగారం, నాయకన్‌గూడెం, పాలేరు, జీళ్లచెరువు గ్రామాల్లో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ లెక్క చేయకుండా మహిళలు వేడుకల్లో పాల్గొన్నారు.



బుర్హాన్‌పురంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ముస్తాబైన సింగారెడ్డిపాలెం శ్రీరామ మందిరం



బీఆర్ఎస్ కార్యాలయంలో..



కూసుమంచిలో..

నిర్విరామంగా నెలనెలా వెన్నెల

సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తొంభై ఎనిమిది నెలలు నిర్విరామంగా నిర్వహిస్తున్న నెలనెల వెన్నెల కార్యక్రమాలు అద్భుతంగా నిర్వహించటం అభినందనీయమని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. ఆదివారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నెలనెల వెన్నెల కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, టీడీపీ రాష్ట్ర నాయకుడు కూరపాటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఒకకార్యక్రమాన్ని ప్రారంభించి ప్రతీ నెల క్రమం తప్పకుండా వరుసగా నిర్వహిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా ఖ్యాతిని చాటుతున్న నెలనెల వెన్నెల నిర్వాహకులను అభినందించారు.ఖమ్మంప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్న ప్రాచీన కళలను ప్రజలకు చూపిస్తూ కళాకారులకు చేయుత నిస్తూన్నా నిర్వాహకులను, సిబ్బంది కృషి మరువలేనిదన్నారు. అనంతరం ఎస్‌వి రంగారావు కళాస్రవంతి కాకినాడ వారు ప్రదర్శించిన ఆచమనం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో న్యాయవాది కాటంనేని రమేష్, కాటంనేని వీరభద్రరావు, నిర్వాహకులు ఏఎస్ కుమార్, వేముల సదానందం, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుదర్శన్

కథలకు కాణాచి..ఖమ్మం

- తెలంగాణ సాహిత్య చరిత్ర పరిశోధకుడు శ్రీనివాస్
- కందిలి- తెలంగాణ కథలు సంకలనం ఆవిష్కరణ



కథల సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కథలకు, కథలకు కాణాచి ఉందని ప్రముఖ తెలంగాణ సాహిత్య చరిత్ర పరిశోధకుడు, విమర్శకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఖమ్మంలో వేదిక హాల్లో జరిగిన ఖమ్మం స్ఫూర్తి-కథాతెలంగాణం సంస్థ ఆధ్వర్యంలో కందిలి-తెలంగాణ కథలు సంకలనాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ కథ చారిత్రక వర్తమాన సామాజిక సాంస్కృతిక అస్తిత్వ స్పృహతో ఆలోచనాత్మకంగా కథలు వస్తున్నాయన్నారు. 11మంది కథకులు రాసిన కథా సంకలనం విభిన్నమైన కథాంశాలతో ఉందన్నారు. ఖమ్మం కథకులైన తాళ్లూరి రామస్వామి, కవిరాజు మూర్తి, జాతశ్రీ లాంటి కథకుల వారసత్వం ఉందన్నారు.వారి కథల్ని కూడా ప్రచురించాలని సూచించారు.అనంతరం ప్రముఖ కవి కథకులు వంశీ కృష్ణ కందిలి కథల్ని విశ్లేషిస్తూ ఆదీవాసీల జీవితం దేశ సామాజిక ముఖచిత్రణ, జీవితాన్ని గెలవడం ఎలా అనే అంశాలపై ఈ సంకలనం లో కథలున్నాయని విశ్లేషించారు. కథాచర్చలో భాగంగా ప్రముఖ సాహిత్య సామాజిక విశ్లేషకులు ఎన్. వేణుగోపాల్ తెలంగాణ గతం-వర్తమానం,-భవిష్యత్తుఅనే అంశంపై మాట్లాడుతూ తెలంగాణ కథ ప్రాదేశికమైనదని, పుట్టుక, జనజీవనం, నుడికారం ప్రామాణికం కావాలని అన్నారు. కార్యక్రమంలో కందిలి కథా సంకలనం సంపాదకుడు ధరణికోట రమేష్ కుమార్, సీతారాం, రవిమారుత్,కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యుడు ప్రసేన్, ఖమ్మం కవులు ఇబ్రహీం నిర్గుణ్, మువ్వా జయశ్రీ, తోటి సుభాషిణి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కుల పంపిణీ చేస్తున్న స్వర్ణకుమారి,దయాకర్ రెడ్డి

ఖమ్మంఅర్బన్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురికి రూ.41 లక్షల ముఖ్యమంత్రి సహానిధి చెక్కులను పంపిణీ చేశారు. ఖమ్మం,కొత్తగూడెం జిల్లాలకు చెందిన 97 మంది సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వారికి రూ.41 లక్షలు మంజూరయ్యాయి. ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి,మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, రఘునాథపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాలాజీనాయక్, ఏన్కూరు మండలపార్టీ అధ్యక్షుడు స్వర్ణనరేందర్, మాజీ కార్పొరేటర్ వడ్డే బోయిన నరసింహారావు,టీపీసీ మెంబర్ ఉమ్మినేని కృష్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ ఉప్పునూతల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణికి సన్మానం

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో సోమవారం నిర్వహించబోయే ఖేలోఇండియావెయిట్ లిఫ్టింగ్ పోటీలో సౌత్ ఇండియా నుంచి బరిలోకి దిగుతున్న ఖమ్మానికి చెందిన క్రీడాకారిణి బీ.టోనీని జిల్లా ఎక్సైజ్‌శాఖ ఉద్యోగులు సన్మానించారు. ప్రతిభ చూపి జిల్లాకు పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణి తల్లి ఆదిలక్ష్మీ ఖమ్మం ఎక్సైజ్‌శాఖలో కానిస్టేబుల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆదివారం ఖమ్మంలో టోనీని ఎక్సైజ్‌శాఖ ఉద్యోగులు సన్మానించారు. ఖమ్మం1టౌన్ సీఐ కృష్ణ, రిటైర్డ్ ఎస్ఐ వెంకట్రావు, కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షుడు కరీం పాల్గొన్నారు.



టోనీని సన్మానిస్తున్న ఉద్యోగులు

అంబేద్కర్‌కు అవమానంపై నిరసన

వైరా, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని 14వ వార్డులోని శాంతినగర్ వద్ద జాతీయ ప్రధాన రహదారి పక్కన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించే రీతిలో అక్రమ నిర్మాణం చేస్తుండడం పట్ల శాంతినగర్‌కు చెందిన కొంతమంది యువకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహాన్ని మూసివేస్తూ అవమానించే రీతిలో అక్రమ నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైరా పోలీస్‌స్టేషన్‌లో, మునిసిపల్ కమిషనర్‌కు వారు ఫిర్యాదు చేశారు. ఆ యువకులు ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్రమ నిర్మాణం వల్ల అంబేద్కర్ విగ్రహం కన్పించకుండా చేస్తున్నారని వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు.

ఆంధ్రా సరిహద్దు గ్రామాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు

బోనకల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాలతో ఆదివారం మండల పరిధిలోని ఆంధ్రా సరిహద్దు గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఆంధ్రా నుంచి వచ్చే అక్రమ ఇసుక తోలకాలను అరికట్టేందుకు గానూ బోనకల్, మోటమర్రి, గోవిందాపురం(ఎ), చొప్పకట్లపాలెం గ్రామాల వద్ద చెక్‌పోస్టులను ఎస్ఐ పొదిలి వెంకన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వాహనాల తనిఖీలు పకడ్బందీగా నిర్వహిస్తామని, అక్రమ తోలకాలకు అడ్డుకట్ట వేస్తామని ఎస్ఐ తెలిపారు.

గంగారంలో మూత్ర శాలలు నిర్మించాలి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో సత్తుపల్లి తర్వాత అత్యంత ప్రాముఖ్యత కలిగిన గంగారం గ్రామానికి సుదీర్ఘమైన చరిత్ర ఉందని, కానీ నేటికి ఏ పాలకులు కూడా మరుగుదొడ్లు నిర్మించిన పాపాన పోలేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెద్ద గ్రామపంచాయితీతో పాటు ఇక్కడి నుంచి ప్రజలు భద్రాచలం, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఖమ్మం తదితర పట్టణాలకు వెళ్తుంటారని, ఇంజనీరింగ్ కళాశాల, పోలీస్ బెటాలియన్ ఉన్నాయని, వెంటనే పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించేందుకు దాతలతో పాటు ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని ఆయన కోరారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి



ఎస్ఐ రామారావు

వైరా, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దుర్గామాత నవరాత్రి ఉత్సవ మండపాల్లో దేవతా విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి పోలీసులకు సమాచారమివ్వాలని, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి విధిగా అనుమతి తీసుకోవాలని వైరా ఎస్ఐ పుష్పాల రామారావు సూచించారు. ప్రశాంత వాతావరణంలో సంతోషకరంగా ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు పోలీసుశాఖ పటిష్ట రక్షణ కల్పిస్తుందని, కాలనీలు, వీధుల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తామని, మహిళలు విలువైన ఆభరణాలు ధరించిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పండుగ సెలవుల దృష్ట్యా ఇళ్లకు తాళాలు వేసి ఎక్కువ రోజులు సొంత గ్రామాలకు వెళ్లినప్పుడు ఇంట్లో ఉన్న వస్తువులను కట్టుదిట్టంగా భద్రపర్చుకోవాలని సూచించారు.

అదనపు విద్యుత్ స్తంభాల ఏర్పాటు

చింతకాని, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో పలు వీధుల్లో ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయలను నివారించేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవతో అదనపు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు బండెల నాగార్జున, తోటకూరి హరీష్, తన్నీరు పుల్లయ్య, మెట్టల కృష్ణ, ముల్లంగి మురళీ, యరమాల ప్రసాద్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చలో భద్రాచలం సభను విజయవంతం చేయాలి

ఏన్కూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చట్టబద్ధతలేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ ఆదివాసీ 9తెగల ఆధ్వర్యంలో ఆదివాసీల హక్కుల కోసం ఈనెల 28న పెద్దఎత్తున తలపెట్టిన చలో భద్రాచలం, ధర్మయుద్ధం బారీబహిరంగ సభను జయప్రదం చేయాలని కొమరం భీం ఫౌండేషన్ సభ్యులు పూనం సుధీర్ కోరారు. ఆదివారం ఏన్కూరులో ముఖ్యకార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది. అనంతరం కొమరంభీమ్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం చలో భద్రాచలం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంఘం నాయకులు వర్షా రాంబాబు, ఈసం కృష్ణయ్య, వాసం నరేష్‌బాబు, శ్రీకాంత్,సోలం శేఖర్, పూనం శ్రీకాంత్, వర్షా లక్ష్మణ్, మల్కామ్ స్వామి, తోలెం వెంకటేశ్వర్లు, ఆరెం రామయ్య, విజయ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు మండల మాజీ అధ్యక్షుడి రాజీనామా

ముదిగొండ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మీగడ శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌కు తన రాజీనామా లేఖను పంపించారు. ఆదివారం వెంకటాపురం గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై తనతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీరనారాయణ, ఉపేందర్, రాంబాబు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభను కోల్పోతున్న స్వయంభూ క్షేత్రం

- అడుగడుగునా పర్యవేక్షణ లోపం
- అపరిశుభ్రంగా ఆలయ పరిసరాలు

ఎర్రుపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కలియుగంలో వెంకటేశ్వరుని నామస్మరణ చేస్తే కష్టాల నుంచి విముక్తి లభించడమే గాకా జీవన్ముక్తి లభిస్తుందని నానుడి. అటువంటి నామస్మరణ ఆ దేవుని ఎదురుగా, ఆయన సన్నిధిలో చేయగలిగితే, ఆయన భక్తులకు అంతకంటే ముక్తి, మోక్షం వేరొకటి లేదు. ఆ మహద్భాగ్యాన్ని ప్రసాదించే వెంకటేశుని దివ్య సన్నిధానాలలో ప్రసిద్ధమైనది, తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురంలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం. కలియుగ దేవుడుగా శ్రీ వేంకటేశ్వరస్వామి జమలాపురం క్షేత్రంపై సాలగ్రామశిలా రూపంలో స్వయంభువుగా వెలిసి, భక్తుల నాదుకొని రక్షించడంలో తనకు సాటి ఎవరూ లేరంటూ దశదిశలాచాటుకుంటూ, అత్యంత భక్తి ప్రియుడిగా పేరొందాడు జమలాపురం శ్రీవారు. కేవలం దర్శనంతోనే తృప్తిపడక భక్తులు శ్రీవారికి ఎన్నో ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహిస్తారు. అందుకే తిరుమల శ్రీవారికి వలే ఇక్కడ కూడా వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. చుట్టూ కొండల మధ్య కొలాహలంగా కోనేటి రాయుడు నిత్యకళ్యాణశోభితుడై విరాజిల్లుతున్నాడు. అంతటి ప్రసిద్ధికెక్కిన జమలాపురం ఆలయం కొండ చుట్టూ ఏపుగా పెరిగిన చెట్లు అడవిని తలపిస్తున్నాయి. పరిసరాలు అపరిశుభ్రతతో దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్యం లేక, పట్టించుకునే నాధుడే లేక ఆలయం బోసిపోతోంది. ఆలయానికి వచ్చే భక్తులు సరైన వసతులు లేక పెదవి విరిస్తున్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో భక్తులకు అవస్థలు తప్పట్లేదు. ఏటా ఆశ్వీయుజ మాసంలో జరిగే శ్రీదేవి శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభిస్తారు కానీ ఈపడాది దేవాలయ అధికారుల కనీస ప్రచారం కూడా నిర్వహించకపోవడంతో భక్తులు నిరాశ చెందుతున్నారు




రెండు నెలలుగా వినిపించని దివ్యవాణి

నిత్యం వెంకటేశ్వర సుప్రభాతం దగ్గర నుంచి గోవిందనామాలు, శ్రీవారి కైంకర్యపూజలు, శాశ్వతదాతల గోత్రనామాలు, సాయంకాలం వేళ వేదపఠనం, సూక్తాలు, వెంకటేశ్వర జపం మొదలగు భక్తులు ఆనందపారవశ్యంలో మునిగిపోయే శ్రవణానందం కలిగించే మంగళవాయిద్యాలు, భక్తి సంగీతం మొదలయినవి గత రెండునెలలుగా ఆలయంలో వినిపించలేదని ఆలయంలో ఏ పూజాకార్యక్రమాలు జరుగుతున్నాయో తెలియడంలేదని, అనౌన్స్‌మెంట్లుకూడా లేవని భక్తులు వాపోతున్నారు. ఆలయంలో మంగళవాయిద్యాలు పరిసరాల పవిత్రతకు, శుభానికి ప్రతీకలుగా ఉంటాయని, ఆధ్యాత్మిక ఉల్లాసం, భక్తి పెంపొందవుతాయని ఆలయంలో దివ్యవాణి వినిపించకపోవడంతో ఆలయం మూగబోతోందని భక్తులు చెబుతున్నారు. ఆలయాధికారులకు శ్రద్ధ లేదని, కమిషనర్, ఉపకమిషనర్ స్థాయి వ్యక్తులు కనీసం పట్టించుకోకుండా ఉండడం వల్ల వారి తీరు ఇష్టారాజ్యంగా ఉదని విమర్శిస్తున్నారు.

అడవిని తలపిస్తున్న పరిసరాలు

సాధారణంగా కొండలపైనే వేంకటేశ్వరస్వామి ఆలయాలు వెలసి ఉంటాయి. అయితే ఈ కొండలు అందంగా ప్రకృతి రమణీయత నిండియుంటే భక్తులు సేదతీరి దైవ సన్నిధిలో గడిపిన అనుభూతి చెందుతారు. అలాకాకుండా చుట్టు కారడవిలా భయనాకంగా ఉంటే ఆలయ పరిసరాల్లో సమయం కేటాయించాలన్నా ఆసక్తి తగ్గిపోతుంది. అధికారులు నిర్లక్ష్యంతో కొండ రమణీయతను కోల్పోయింది. దానికితోడు పురుగులు, కీటకాలు, పాములు, కోతుల భయంతో భక్తులు కొండపై సంచరించేందకు భయపడుతున్నారు. ప్రస్తుతం ధార్మిక భవనం కిందకు రావడంతో కొండపైకి వెళ్లి పర్యవేక్షణ చేసే నాధుడే కరువయ్యాడు. కాగా ఆలయంలో ఇప్పటి వరకు దశాబ్దాలుగా ఇన్‌చార్జి ఈవోలతో దేవాదాయశాఖ నెట్టుకొస్తోంది.



చుట్టూ కారడవిలా పెరిగిన చెట్ల మధ్య జమలాపుం శ్రీవారి ఆలయం

నేటి నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సెప్టెంబరు 22న ప్రారంభమై అక్టోబరు2 విజయదశమి(దసరా)తో ముగిసిపోనున్నాయి. ప్రతి ఏడాది ఆశ్వీయుజ మాసంలో శ్రీవారి ఆలయంలో కూడా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఆలయ సాంప్రదాయంగా వస్తోంది. ఈనెల సెప్టెంబరు 22న వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల తీర్థపు బిందెతో యాగశాల ప్రవేశం జరుగుతుంది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు జ్యోతిప్రజ్వలనచేసి కలిశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు. నవరాత్రులు ప్రారంభం సందర్భంగా శ్రీవారికి పంచామృతాలతో సుగంధ ద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి చందన అలంకారంలో భక్తులకు దర్శనం కలిపిస్తారు. ఈ నవరాత్రుల్లో 29నమూలా నక్షత్రం సందర్భంగా సరస్వతిదేవి అలంకారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అదేరోజున మూడురోజులపాటు నిర్వహించే సామూహిక చండీహోమం కూడా ప్రారంభం జరుగుతుంది. 2న విజయదశమి వేడుకకలు, శమీపూజతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ9రోజులు ఆలయానికివచ్చే పరిమితిలేని ఉచిత నిత్య అన్నదానం జరుగుతుంది.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసేది ఒక్క సీపీఐ అని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ అన్నారు. ఆదివారం సత్తుపల్లిలో నిర్వహించిన సమావేశంలో సింగరేణి బాంబ్ బ్లాస్టింగులతో ద్వారకాపూరి కాలనీలో నివాసులు అంతా ఇబ్బందులకు గురవుతున్నారని, అదేవిధంగా ఇళ్లపై వెళ్తున్న 30కేవీ విద్యుత్ లైన్ తీసివేసి అంతర్గత సీసీ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.

తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తె

వైరా, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ఒకటో వార్డు బీసీ కాలనీలో పర్సా కొండలరావు(45) ఆదివారం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు త్రిష, భవ్య. వీరిద్దరూ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. తండ్రి అంత్యక్రియలను పెద్ద కుమార్తె త్రిష నిర్వహించి తండ్రి రుణం తీర్చుకుంది.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ఏన్కూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మరావుపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య రవాణశాఖ అధికారి బొర్రా తిరుపతయ్య ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. గ్రామంలో ఇటీవల మృతిచెందిన చల్ల భద్రాద్రి, తమ్మిశెట్టి రోహిత్, ఇసనపల్లి కృష్ణ కుటుంబాలకు దశదిన కర్మలకు ఒక్కో కుటుంబానికి రూ.5వేలు చొప్పున గ్రామానికి చెందిన తెప్పల సత్యం, మేడ వెంకటేశ్వర్లు ద్వారా కుటుంబ సభ్యులకు అందించారు. బొర్రా తిరుపతయ్య సేవా కార్యక్రమాలు చేస్తూ గ్రామస్తుల మన్ననలుపొందుతున్నారు. ఈసందర్భంగా తిరుపతయ్యను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

అభివృద్ధి పేరుతో మధిర పట్టణ రోడ్లు ధ్వంసం

- రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలి
- మాజీ జడ్పీచైర్మన్ కమల్‌రాజ్

మధిరరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో అభివృద్ధి పేరుతో రోడ్లను ధ్వంసం చేశారని ఆరోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాజీ జడ్పీచైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మధిర పట్టణంలోని పలు వార్డుల్లో ధ్వంసమైన రోడ్లను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రివ్యూల పేరుతో కాలయాపన చేయవద్దని, గత ఐదునెలలుగా అండర్ డ్రెయినేజీ నిర్మాణం పేరుతో రోడ్లను తవ్వి ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ రోడ్లలో హాస్పిటల్‌కు వెళ్లేందుకు అంబులెన్స్ వచ్చే పరిస్థితి కూడా లేదని, అనేకమంది వాహనదారులు జారి కిందపడి గాయాలపాలవుతున్నారని, ప్రజలు నడిచే పరిస్థితి లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టడమేనా మీ ప్రజాపాలన అని ప్రశ్నించారు. వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని లేకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అరిగె శ్రీనివాసరావు, వైవీ.అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, ధీరావత్ మాధవి, అయిలూరి ఉమామహేశ్వర్ రెడ్డి, బత్తుల శ్రీనివాసరావు, గుగులోతు కృష్ణనాయక్, చీదిరాల రాంబాబు, నాగులవంచ రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమల్‌రాజ్

డెంగీ నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

వైరా, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లాలో విజృంభిస్తున్న డెంగ్యూ జ్వరాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రముఖ వైద్యుడు చీకటి భారవి, బోడేపూడి కళానిలయం సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో ఆదివారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైరా పరిసర ప్రాంతాల నుంచి భారీగా వచ్చిన రోగులను డాక్టర్లు భారవి, పిల్లలమర్రి సుబ్బారావు, రమణారెడ్డి పరీక్షించారు. ఈ సందర్భంగా భారవి, రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేసి అన్నివర్గాల ప్రజలకు కనీస వైద్యం ఉచితంగా అందించాలని కోరారు. వైద్యరంగానికి ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాలని కోరారు. బోడేపూడి కళానిలయం నిర్వాహకులు మాజీ ఎంపీపీ బొంతు సమత, సుంకర సుధాకర్, గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, మాదినేని రజిని, మోదుగు నాగరాణి, కంభంపాటి సత్యనారాయణ, మల్లెంపాటి ప్రసాద్, మందడపు నాగేశ్వరరావు, అనుమోలు రామారావు వైద్యశిబిరంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్యవైశ్యుల కమ్యూనిటీ భవనానికి స్థలాన్ని కేటాయించండి

వైరా, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఆర్యవైశ్యుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు ఆర్యవైశ్య సంఘం నాయకులు శనివారం రాత్రి వినతిపత్రం సమర్పించారు. కమ్యూనిటీ హాల్‌కు స్థలాన్ని కేటాయించాలని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్, నాయకులు సత్యంబాబు, కొల్లా రాంబాబు, శబరీనాథ్, నూకల వాసు, కటకం శివ, వజినేపల్లి చక్రవర్తి తదితరులు కోరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు పమ్మి అశోక్, రాంపూడి రోశయ్య, బోళ్ల గంగారావు, ఐవీఎస్. నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకులు

4దశాబ్దాల తర్వాత అపూర్వ కలయిక



పాఠశాలలో 1985నాటి 10వతరగతి బ్యాచ్

సత్తుపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వారు చదువుకున్న రోజుల్లోని మధుర జ్ఞాపకాలను నాలుగు దశాబ్దాల తర్వాత పంచుకున్నారు. అప్పుడు అందరితో అల్లరి చేసిన రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయుల తమ అనుబంధాలను నెమరువేసుకున్నారు. తోటి స్నేహితులతో గడిపిన క్షణాలను ఆదివారం సత్తుపల్లి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు జ్ఞప్తికి తెచ్చుకున్నారు. 40ఏళ్ల క్రితం అంటే 1985లో ఇదే పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్న సుమారు 30మంది పూర్వ విద్యార్థులు అంతా ఒక్కచోట చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఒకరిద్వారా మరొకరు ఫోన్ నెంబర్లను సేకరించుకుని ఒక్కచోట చేరి భావోద్వేగానికిలోనయ్యారు. మున్ముందు మళ్లీ కలుసుకుని తమ మిత్రులలో వెనుకబడిన వారికి చేయూతను అందించడం, పాఠశాల అభివృద్ధికి సహకరించేందుకు ముందుకు రానున్నట్లు పూర్వ విద్యార్థులు ఎర్రబోలు పద్మజ, సుధా, స్వరూపరాణి, బజ్జూరిపద్మ, సురేఖలు ప్రకటించారు.

కారేపల్లి మహాజాతరను విజయవంతంచేయాలి

- అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే

కారేపల్లి సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లిలో దసర సందర్భంగా అక్టోబరు2 నుంచి7వరకు జరగనున్న శ్రీ కోటమైసమ్మతల్లి మహాజాతరను దేవదాయశాఖ అధికారులు విజయవంతం చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కోరారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో వివిధ శాలకు చెందిన అధికారులు, ఆలయ సిబ్బందితో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరకు సంబంధించిన గోడ పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అతిపెద్దజాతరలలో ఒకటైన శ్రీకోటమైసమ్మతల్లి జాతరకు వివిధ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారన్నారు. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతరలో మద్యం విక్రయాలు జరగకుండా చూడాలని, వచ్చే వాహనాలకు సరైనా రహదారి ఏర్పాటు చేసి రోడ్డుకు ఇరుపక్కల విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసుశాఖ జాతరలో ప్రధాన భూమిక పోషించాల్సి ఉంటుందని, రెండు వందల మందితో బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసుశాఖ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. సమీక్షకు ముంది ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను ఆలయఅధికారులు ఆలయ మర్యాదలతో ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ పట్టాబి రామారావు ఎమ్మెల్యేను శాలువకప్పి తీర్థ ప్రసాదాలు అందచేశారు. అలాగే మండల పరిధిలోని 35 మందికి కళ్యాణలక్ష్మీ, 11మందికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే రాంస్‌నాయక్ పంపిణీచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడుతుందన్నారు.



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాందాస్

భట్టిని విమర్శించే నైతిక హక్కు సీపీఎం నాయకులకు లేదు

- కాంగ్రెస్ నాయకుల ఫైర్

బోనకల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను విమర్శించే నైతిక హక్కు సీపీఎం నాయకులకు లేదని డీసీసీ కార్యదర్శి పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావులు విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ఎక్కడో ఒకచోట రాకపోతే దానిని రాద్ధాంతం చేయడం తగదన్నారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఉనికి కోసమే సీపీఎం నాయకులు పాదయాత్ర చేశారని ఆరోపించారు. గత పదేళ్ల దొరల పాలనలో పేదల సమస్యలు ఆ పార్టీ నాయకులకు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి సుబ్బారావు, కందుల పాపారావు, మరీదు శ్రీనివాసరావు, నల్లమోతు సత్యనారాయణ, షేక్ దస్తగిరి, నరేష్ పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బోనకల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో ఆదివారం అనారోగ్య బాధితులకు డీసీసీ కార్యదర్శి పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కల చొరవతో ఇప్పటికే 22 లక్షల ఆర్థిక సహకారం అందించామని తెలిపారు. బోనకల్‌లో రూ. 2.53 లక్షల చెక్కులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోటపల్లి స్వామి, భూక్యా సైదా నాయక్, పోటు వెంకటేశ్వర్లు, పాసంగులపాటి కోటేశ్వరరావు, మరీదు శ్రీనివాసరావు, యార్లగడ్డ కృష్ణయ్య, మోర్ల మహేశ్వరరావు, జ్వాల, వేణు, బాలకృష్ణ, హైమావతి, జయకుమారి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

చింతకాని: మండల పరిధిలోని 24 గ్రామాలకు చెందిన 104 మంది లబ్ధిదారులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫారసుతో రూ.33,59,500 నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. సంబంధిత చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

అన్నివర్గాలకు అండగా ప్రభుత్వం: దయానంద్

సత్తుపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకతీతంగా రాష్ట్రంలో పాలన సాగిస్తోందని, ఈ క్రమంలో అన్నివర్గాలకు అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని కిష్టారంలో పర్యటించి సింగరేణి జీఎం ఆఫీస్ నూతన భవనం, నిర్మాణంలో సింగరేణి ఆఫీసర్స్ క్వార్టర్స్, సింగరేణి కమ్యూనిటీ భవనం, కిష్టారం బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. నిర్మాణాలను వేగంగా పూర్తిచేసి అన్నిహంగులతో అందుబాటులో తేవాలని కోరారు. కార్యక్రమంలో ఓసీల పీవోలు ఎన్ఎస్‌వీ.ప్రహ్లాద్, ఎంవీ.నరసింహారావు, అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తులసీదాసుకు సన్మానం

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కీర్తిచక్ర పుష్కర్ జాతీయ అవార్డు అందుకున్న డా.జెట్టి శ్రీకృష్ణ తులసీదాసును ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ వెంకటేశ్వరరావు ఖమ్మంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ అవార్డును హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో భారతమాతకు అభినందనలు సంకల్ప పుస్తక ఆవిష్కరోత్సవంలో తెలంగాణ సాంస్కృతిక సారధి డా.జీ.వెన్నెల గద్దర్ చేతులమీదుగా అందుకోవడం అభినందనీయమన్నారు.



గిరిజన ఆశ్రమ పాఠశాలను కల్లూరులోనే ఉంచాలి

- ఎమ్మెల్యే రాగమయికి ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుల వినతి

కల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలను సత్తుపల్లికి తరలించకుండా కల్లూరులోనే యధావిధిగా కొనసాగించాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మసోతు దరశరధ్ నాయక్ ఆధ్వర్యంలో పలువురు గిరిజన నాయకులు ఆదివారం సత్తుపల్లిలో ఎమ్మెల్యే మట్టా రాగమయిని నేరుగా కలిసి వినతిపత్రం అందిచారు. కల్లూరు రెవెన్యూ డివిజన్ కేంద్రం పరిధిలో అనేక గిరిజన గ్రామాల నుంచి నిరుపేద విద్యార్థినులు ఈ ఆశ్రమ పాఠశాలలో విద్యాబాస్యం చేస్తున్నారని తెలిపారు. ఇలా 30 సంత్సరాల క్రితం నుంచి ఎంతోమంది గిరిజన పేద విద్యార్థినులకు ఇక్కడ మేలు జరుగుతోందని వారు చెప్పారు. ఈ ఆశ్రమ పాఠశాలలో గత ఆగస్టు నెలలో ఆహారం తయారి లోపంతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనలు సాకుగా చూపి ఐటీడీఏ అధికారులు కల్లూరులో సంత్సరాలుగా కొనసాగుతున్న ఈ ఆశ్రమ పాఠశాలను అకారణంగా సత్తుపల్లికి తరలించడం ఏమాత్రం తగదని పేర్కొన్నారు. ఈ మేరకు కల్లూరులో కొనసాగే విషయంలో తగిన విధంగా ఐటిడిఏ అధికారులతో సంప్రదించగా వారు సానుకులాంగా స్పందించారన్నారు. ఈ పాఠశాల కల్లూరులోనే ఉండేలా ఎమ్మెల్యే రాగమయి హామీ ఇచ్చారని వారు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయికి ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు ధశరధ్‌నాయక్, గూగులోతు కృష్ణనాయక్, నందునాయక్, తల్లాడ మండల నాయకులు భూక్యా రవి నాయక్, నాగనాయక్, మనోజ్‌నాయక్, శంకర్‌నాయక్‌లు కృతజ్ఞతులు తెలిపారు.

పరిశుభ్రతలో పంచాయతీ కార్మికుల సేవ మరువలేనిది

కొణిజర్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలను పరిశుభ్రంగా ఉంచే విషయంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న కృషి మరువలేనిదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు తెలిపారు. నరేంద్రమోదదీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని తనికెళ్లలో పల్లెదవాఖానాలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికులను సన్మానించారు. ఈసందర్భంగా నెల్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామాన్నిపరిశుభ్రంగా ఉంచే విషయంలో పంచాయతీ కార్మికులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. బీజేపీ అధ్యక్షుడు కవిడ మురళీకృష్ణ, కార్యదర్శి కవిడ రాంబాబు, మల్లిఖార్జున్, నాయకులు సత్యానారాయణ,నోముల జనార్ధన్, గంజి రాజేష్, మనోజ్, హరిలాల్, భరత్‌శంకర్, శ్రీధర్, రామారావు పాల్గొన్నారు.

